Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 | సంచిక : 262 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 11 అక్టోబర్ 2023 | బుధవారం | పేజీలు : 4

### యూపీఐ లావాదేవీలపైనా నిఘా..!

హైదరాబాద్ : రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, మద్యం, నగదు అక్రమ రవాణాతోపాటు ఆన్‌లైన్ (యూపీఐ) లావాదేవీల పైనా ప్రత్యేక నిఘా ఉంటుందని తెలంగాణ ఎన్నికల సంఘం, జీహెచ్ఎంసీ పేర్కొంది. రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లినా, యూపీఐ ద్వారా ఎక్కువ మందికి డబ్బు పంపితే సంబంధిత పత్రాలు చూపించాల్సి ఉంటుందన్నారు. రూ.10 లక్షల కంటే ఎక్కువ ఆన్‌లైన్ లావాదేవీల వివరాలు బ్యాంకుల నుంచి సేకరిస్తామని స్పష్టం చేశాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాసరాజ్ బీఆర్కే భవన్‌లో, జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ రోనాల్డ్ రోస్ వివరాలు వెల్లడించారు. ఆస్పత్రులు, భూ క్రయ విక్రయాలు, వివాహాలకు సంబంధించి నగదు, బంగారం తీసుకెళితే సంబంధిత ఆధారాలు కచ్చితంగా చూపాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్

# "గ్యారంటీ" గేమ్ ఛేంజర్

# ఏం జరుగుతోంది..!!




హైదరాబాద్ : తెలంగాణలో అసలైన ఎన్నికల యుద్ధం మొదలైంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించి బీఆర్ఎస్ రేసులో ముందుంది. ఎలాగైనా అధికారంలోకి రావాలని కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తోంది. కేసీఆర్ ను ఢీ కొట్టేందుకు స్వయంగా సోనియా రంగంలోకి దిగారు. సీడబ్ల్యూసీ సమావేశాలు హైదరాబాద్ లో నిర్వహించి తమ టార్గెట్ స్పష్టం చేసారు. ఇదే సమయంలో తెలంగాణ ప్రజలకు గ్యారంటీ స్కీంలను ప్రకటించారు. ఇది గేమ్ ఛేంజర్ గా మారుతుందిన భావిస్తున్నారు. జరిగే అవకాశం ఉందా. గ్యారంటీ హామీలతో కాంగ్రెస్:కర్ణాటక తరువాత దక్షిణాదిన తెలంగాణ పై కాంగ్రెస్ ఆశలు పెట్టుకుంది. తాజాగా సోనియా గాంధీ పార్టీ రాష్ట్ర నేతలకు ఎలాగైనా గెలవాలని నిర్దేశించింది. పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేస్తామంటూ తాజా బహిరంగ సభ ద్వారా గ్యారంటీ పథకాలను ప్రకటించారు. కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్ లో ఇలాంటి గ్యారంటీల ద్వారానే ప్రజలు పార్టీకి దగ్గరయ్యారని చెబుతున్నారు. అయితే, తెలంగాణలోనూ ఈ ప్లాన్ వర్కవుట్ అవుతుందా లేదా అనే చర్చ సాగుతోంది. కేసీఆర్ ఇప్పటికే ప్రతీ ఇంటికి సంక్షేమం అందిస్తున్నారు. ఈ సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన గ్యారంటీ స్కీంలు బీఆర్ఎస్ ఓటు బ్యాంకు పైనా ప్రభావితం చూపటం ఖాయమని కాంగ్రెస్ చెబుతుంటే...గులాబీ నేతలు మాత్రం అవకాశం లేదంటున్నారు.

**బీఆర్ఎస్ పై ప్రభావం :** కాంగ్రెస్ హామీలను ప్రజలను నమ్మరనేది బీఆర్ఎస్ నేతల వాదన. సీఎం కేసీఆర్ రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టి ఏటా ఎకరాకు రూ.10 వేల సాయం అందిస్తున్నారు. ఈ పథకం కింద రూ.75 వేల కోట్లను రైతు ఖాతాల్లో జమ చేశారు. దీనినే కాంగ్రెస్ కాపీ కొట్టి రైతుభరోసాగా పేరు మార్చింది. కౌలు రైతులకు రైతుభరోసా ఇస్తామని చెప్పడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. కౌలు రైతులను గుర్తించడం పెద్ద సమస్య అని, పొలానికి సంబంధించి పెట్టుబడి సాయం రైతుకు ఇస్తారా? కౌలురైతుకు ఇస్తారా? లేదా ఇద్దరికీ ఇస్తారా అనేది స్పష్టత లేదు. కౌలు రైతులు, కూలీలకు కలిపి కోటి మందికిపైగా ఇవ్వాల్సి ఉంటుందని, ఎలా సాధ్యమనే వాదన ఉంది. గత ఎన్నికల్లోనూ రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్‌ను కాకుండా రూ.లక్ష రుణమాఫీ చేస్తామన్న కేసీఆర్‌ను నమ్మి ఓటేశారని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు కూడా అదే విధంగా కాంగ్రెస్ హామీలను నమ్మే పరిస్థితి లేదని విశ్లేషిస్తున్నారు.

**గులాబీ నేతల ధీమా:** గృహలక్ష్మి పథకాన్ని కాపీ కొట్టి కాంగ్రెస్ మళ్లీ 'ఇందిరమ్మ ఇండ్లు' అని ప్రకటించిందని చెబుతున్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు పథకం అమలవుతున్నది. ఈ పథకాన్ని కాంగ్రెస్ కాపీ కొట్టి మరో 100 యూనిట్లు పెంచి 'గృహజ్యోతి' అని ప్రకటించిందనే వాదన ఉంది. పెన్షన్ల విషయంలోనూ బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ హామీలు అమలయ్యే అవకాశం లేదని చెబుతున్నారు. రాష్ట్ర ఆదాయవ్యయాలను దృష్టిలో పెట్టుకొని పథకాలు ప్రకటించి, అమలు చేసినప్పుడే వాటికి విలువ, ప్రజలకు ప్రయోజనం ఉంటుంది. కానీ కాంగ్రెస్ ఇచ్చిన హామీలు చూస్తుంటే ఒక్క తెలంగాణ బడ్జెట్ సరిపోయే పరిస్థితిలేదని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. దీంతో, ఇప్పుడు కాంగ్రెస్ హామీలతో తమకు నష్టం లేదనేది బీఆర్ఎస్ ధీమాగా కనిపిస్తోంది.

# తెలంగాణలో గెలుపు ఎవరిదంటే?




## సీఓటర్ సర్వే ఏం చెప్పిందంటే..?

న్యూఢిల్లీ: ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తేదీని ఎన్నికల కమిషన్ సోమవారంనాడు ప్రకటించడంతో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఒపీనియన్ సర్వే ఫలితాలు సైతం వెలువడుతున్నాయి. రాజకీయంగా కాక పుట్టిస్తున్న తెలంగాణలో ఓటరు నాడి ఎలా ఉండబోతోంది? పోటీ ఎవరి మధ్య ఉండనుంది? ఫలితాలు ఏ విధంగా ఉండే అవకాశాలున్నాయనే అంశాలపై ఏబీపీ-సీఓటర్ సర్వే ఆసక్తికరమైన విషయాలు వెల్లడించింది. ఏబీపీ-సీఓటర్ ఒపీనియన్ పోల్స్-2023 వివరాల ప్రకారం, తెలంగాణలో కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య నువ్వానేనా? అనే రీతీలో హోరాహోరీ పోరు, ముఖాముఖీ పోటీ ఉండబోతోంది. మొత్తం 119 స్థానాలకు గాను బీఆర్ఎస్‌కు 43 నుంచి 55 వరకూ సీట్లు వస్తాయి. కాంగ్రెస్ 48 నుంచి 60 సీట్లు గెలుచుకుంటుందని సర్వే అంచనా వేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా స్టార్ క్యాంపెయినర్లుగా ఉన్న బీజేపీ 5 నుంచి 11 సీట్లకు పరిమితమవుతుంది. ఇతరులు 5 నుంచి 11 సీట్లు గెలుచుకునే అవకాశం ఉంది.

**ఓట్ల షేర్ ఇలా...** ఏబీపీ-సీఓటర్ సర్వే అంచనా ప్రకారం, కాంగ్రెస్ 39 శాతం ఓట్ల షేర్ రాబట్టనుంది. గత ఎన్నికల్లో 28.3 శాతం ఓట్ల షేర్ ఉన్న కాంగ్రెస్ అదనంగా మరో 10.5 శాతం ఓటింగ్ పెంచుకోనుంది. ఆ తర్వాత స్థానంలో బీఆర్ఎస్ 37 శాతం ఓటింగ్ షేర్ రాబట్టుకోనుంది. ఆప్రకారం గత ఎన్నికల్లో కంటే ఓటింగ్ శాతం 9.4 శాతం తగ్గనుంది. బీజేపీ సైతం 16 శాతం ఓట్ల షేర్ రాబట్టుకోనుంది. గత ఎన్నికల కంటే ఇది 9.3 శాతం అధికం. ఇతరుల ఓటింగ్ శాతం 7.4 వరకూ ఉంటుంది. గత ఎన్నికల్లో ఇది 17.8 శాతంగా ఉండగా, ఈసారి 10.4 శాతం ఓటింగ్ షేర్ తగ్గనుంది.




## అభ్యర్థులను ఖరారు చేసేందుకు 14న కాంగ్రెస్ ఎన్నికల కమిటీ భేటీ

ఢిల్లీ: 14వ తేదీన కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సమావేశం కానుంది. తెలంగాణ ఎమ్మెల్యే అభ్యర్థులను ఖరారు చేసేందుకు కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సమావేశం కానుంది. 14వ తేదీన ఏఐసీసీతో కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సభ్యులు భేటీ కానున్నారు. ఇప్పటికే అభ్యర్థుల కసరత్తును తెలంగాణ స్క్రీనింగ్ కమిటీ పూర్తిచేసింది. 8వ తేదీన జరిగిన స్క్రీనింగ్ కమిటీలో అభ్యర్థుల లిస్టును పూర్తి చేసి ఏఐసీసీ కేంద్ర ఎన్నికల కమిటీకి పంపినట్లు స్క్రీనింగ్ కమిటీ పేర్కొంది.

# డిసెంబర్ 3న హైదరాబాద్‌లో బిజెపి జెండా ఎగరాలి



## ఆదిలాబాద్ జనగర్జన సభలో అమిత్ షా

ఆదిలాబాద్: తెలంగాణలో భాజపా రాజ్యం తీసుకురావాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. ఆదిలాబాద్‌లో మంగళవారం నిర్వహించిన భాజపా జనగర్జన సభలో ఆయన పాల్గొన్నారు. కుమురం భీంను స్మరించుకుంటూ ప్రసంగం ప్రారంభించిన అమిత్ షా.. పవిత్ర భూమి ఆదిలాబాద్‌కు రావడం సంతోషంగా ఉందన్నారు. "మోదీ నేతృత్వంలో తెలంగాణలో భాజపా ప్రభుత్వం ఏర్పడుతుంది. డిసెంబరు 3న హైదరాబాద్‌లో భాజపా జెండా ఎగరాలి. తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావాల్సిన సమయం ఆసన్నమైంది. కేసీఆర్ వైఖరి కారణంగా గిరిజన వర్సిటీ ఏర్పాటు ఆలస్యమైంది. గిరిజన వర్సిటీకి కేసీఆర్ సర్కారు జాగా చూపించలేదు.. అందుకే ఆలస్యమైంది. మోదీ.. కృష్ణా ట్రైబ్యునల్ నిబంధనలు మార్చి తెలంగాణకు నీటి ఇబ్బంది లేకుండా చేశారు. పదేళ్లుగా కేసీఆర్ తెలంగాణ పేదల సమస్యలు తీర్చలేదు.

కేసీఆర్.. రైతులు, దళితులు, గిరిజనులను పట్టించుకోలేదు. మోదీ ప్రభుత్వం చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించింది" అని అమిత్ షా తెలిపారు.

**కాంగ్రెస్ పేదల కోసం చేసిందేమీ లేదు..** "ప్రతి పేద మహిళకు మోదీ వంటగ్యాస్ సిలిండర్ ఇచ్చారు. రైతుల ఖాతాల్లో ఏటా రూ.6వేలు జమ చేస్తున్నాం. ఒడిశాలో పుట్టిన నిరుపేద గిరిజన మహిళను మోదీ.. రాష్ట్రపతిని చేశారు. కాంగ్రెస్ పేదల గురించి మాట్లాడుతుంది కానీ.. పేదల కోసం ఏమీ చేయదు.

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం చేసిందేమీ లేదు. ఎన్నికలు రాగానే కాంగ్రెస్ వాళ్లు కొత్త బట్టలు వేసుకుని వస్తారు. 9ఏళ్లుగా మోదీ సర్కారుపై ఎలాంటి అవినీతి ఆరోపణలు రాలేదు. కేసీఆర్ గిరిజనుల కోసం ఎన్నో హామీలు ఇచ్చారు.. కానీ అమలు చేయలేదు. ఆదివాసీలకు రెండు పడక గదుల ఇళ్లు ఇస్తామన్నారు.. ఇచ్చారా? దళితులు, గిరిజనుల కోసం మోదీ తొమ్మిదేళ్లుగా ఎన్నో కార్యక్రమాలుచేపట్టారు. కేసీఆర్ మాత్రం పదేళ్లుగా తన కుటుంబం గురించే ఆలోచిస్తున్నారు" అని అమిత్ షా విమర్శించారు.

**అడ్డంకులను అధిగమించి రామమందిరం నిర్మాణం...** "అయోధ్యలో రామమందిరం కట్టాలా? వద్దా? చెప్పండి? అడ్డంకులను అధిగమించి మోదీ సర్కారు రామమందిరం నిర్మిస్తోంది. ఆర్టికల్ 370 ఎత్తివేసి కశ్మీర్‌కు విముక్తి కల్పించింది. సర్జికల్ స్ట్రయిక్స్ నిర్వహించి శత్రువులను తరిమికొట్టింది. తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్ చేశానని కేసీఆర్ చెబుతుంటారు.. రైతుల ఆత్మహత్యల విషయంలో, అవినీతి విషయంలో తెలంగాణను నెంబర్‌వన్ చేశారు. కేసీఆర్ ఎన్నికల గుర్తు కారు.. కానీ, ఆ కారు స్టీరింగ్ మాత్రం ఒవైసీ దగ్గర ఉంటుంది. ఎంఐఎం దగ్గర స్టీరింగ్ ఉన్న భారాస సర్కారు అవసరమా?. మోదీ సర్కారు ఉచితంగా టీకాలు ఇచ్చి తెలంగాణ ప్రజలను కరోనా నుంచి కాపాడింది. కొందరికి మాత్రమే ఇచ్చి దళితబంధు గురించి గొప్పలు చెబుతున్నారు. చంద్రశేఖర్‌రావూజీ.. దళితులకు మూడెకరాల భూమి హామీ ఏమైంది. ఆధునిక రజాకార్ల నుంచి తెలంగాణను భాజపా మాత్రమే కాపాడుతుంది" అని అమిత్ షా అన్నారు.

**ధర్మానికి అడ్డా.. ఆదిలాబాద్ గడ్డ: బండి సంజయ్ –** అసెంబ్లీ ఎన్నికల తర్వాత తెలంగాణలో వచ్చేది మోదీ రాజ్యమేనని .. ఎవరూ ఆపలేరని భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. "నిజాం మెడలు వంచి హైదరాబాద్‌కు స్వాతంత్ర్యం తెచ్చిన ఘనత సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు దక్కింది. అమిత్ షా ఆధునిక సర్దార్ వల్లభాయ్ పటేల్. కేసీఆర్ నా గురువు.. ఆయన వద్దే భాష నేర్చుకున్నా. రాష్ట్రం బాగుపడాలంటే పేదల రాజ్యం రావాలి. ధర్మానికి అడ్డా.. ఆదిలాబాద్ గడ్డ" అని బండి సంజయ్ అన్నారు.

# సంపాదకీయం

## బీజేపీ హంగూ ఆర్భాటం అంతా హంగ్ కోసమా..?

కింగ్ మేకర్ కింగ్ ఈ పదాలు రాజకీయాల్లో చాలా చిత్రంగా తమాషాగా వినిపిస్తాయి. దేశంలో సంకీర్ణ రాజకీయాల యుగం 1989 తరువాత స్టార్ట్ అయింది. అది చాలా కాలం కొనసాగింది. ఇప్పటికీ కొన్ని చోట్ల హంగ్ అసెంబ్లీలు వస్తున్నాయి. కేంద్రంలో అయితే గత పదేళ్ళుగా ఫుల్ మెజారిటీతో ప్రభుత్వం వచ్చింది. ఇంతకీ హంగ్ ఎందుకు అంటే ఒక్క సీటు ఉన్న వారూ ఓవర్ నైట్ లో కింగ్ మేకర్ అయిపోవడానికే అన్నది తెలిసిందే. బీజేపీకి కేంద్రంలో ఫుల్ మెజారిటీ కావాలి. కానీ తెలంగాణాలో హంగ్ రాలని ఉందని అంటున్నారు. బీజేపీ సీనియర్ నేత బీఎల్ సంతోష్ అయితే తెలంగాణాలో హంగ్ వస్తుందని అంటున్నారు. పై పెచ్చు అధికారం మనదే అంటున్నారు. అంతా ఎన్నికల యుద్ధంలోకి దిగాలని సూచించారు. తెలంగాణా బీజేపీ నేతలతో ఆయన మాట్లాడుతూ ఈ కీలకమైన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణాలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఆయన బల్ల గుద్దుతున్నారు. ఏ సర్వే చూసినా బీజేపీకి డబుల్ డిజిట్ నంబర్ సీట్లు ఇవ్వడం లేదు. తెలంగాణాలో అధికారంలోకి రావాలంటే అరవై సీట్లు రావాలి. మరి బీజేపీకి ఇంత ధైర్యం ఎలా వస్తోంది. అధికారం మనదే అని ఎలా చెబుతోంది అన్నదే చర్చగా ఉంది. కర్నాటకలో మధ్యప్రదేశ్ లో మహారాష్ట్రలో చేసినట్లుగా తెలంగాణాలో బీజేపీ చేస్తుందా అన్న సందేహాలు వస్తున్నాయి. అయితే పైన చెప్పిన రాష్ట్రాలలో బీజేపీ అధికారానికి చాలా దగ్గరగా వచ్చింది. మెజారిటీని కొద్దిలో మిస్ అయింది. కాబట్టి మిగిలిన పార్టీల నుంచి కొంతమందిని రప్పించుకుని సర్దుకుని మరీ ప్రభుత్వాలని ఏర్పాటు చేసింది. మరి తెలంగాణాలో ఎలా సాధ్యం అన్నదే ప్రశ్న. ఇక్కడ బీయారెస్ గట్టిగా ఉంది. కాంగ్రెస్ ఢీ కొడుతోంది. ఒకవేళ సంతోష్ అన్నట్లుగానే హంగ్ అంటూ వస్తే మెజారిటీకి ఆ రెండు పార్టీలే కాస్తా దగ్గరగా వచ్చి ఆగిపోతాయి. అపుడు బీయారెస్ ఆపరేషన్ స్టార్ట్ చేయవచ్చు. లేదా కాంగ్రెస్ నుంచి అయినా ఆహ్వానాలు ఇతర పార్టీలకు రావచ్చు. అంతే తప్ప బీజేపీకి ఎలా చాన్స్ వస్తుంది అన్నది కీలక ప్రశ్న. మరో వైపు చూస్తే హంగ్ వస్తే అయిదారు సీట్లు తక్కువ పడితే ఎటూ మజ్లీస్ బీయారెస్ కి అండగా ఉంటుందని కూడా అంటున్నారు. ఒకవేళ మజ్లీస్ మనసు మార్చుకుంటే కాంగ్రెస్ కి చాన్స్ ఉంటుంది. మరి సింగిల్ డిజిట్ లో సీట్లు తెచ్చుకునే బీజేపీకి ఈ పొలిటికల్ గేం లో హంగ్ లో ఆర్భాటం చేసే అవకాశం ఎలా వస్తుంది అన్నదే చర్చ. అయితే కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంటుంది కాబట్టి సామదాన భేద దండోపాయాలు ఏమైనా రచించి మొత్తం కథను అడ్డంగా నిలువుగా తిప్పుతారేమో అన్న డౌట్లు అయితే వస్తున్నాయి. మొత్తం మీద చూస్తే కాషాయం పార్టీ వారు మెజారిటీ గురించి మాట్లాడడం లేదు హంగ్ అంటున్నారు. కాబట్టి కాంగ్రెస్ అయినా బీయారెస్ అయినా అభ్యర్ధుల ఎంపిక నుంచే జాగ్రత్త పడక తప్పదని హెచ్చరిస్తున్నారు. బీజేపీ హంగ్ కింగ్ కింగ్ మేకర్ కలలు ఎలా సాకారం అవుతాయో మరో మూడు నెలలు ఆగితే అంతా తెలుస్తుంది అని కూడా అంటున్నారు.

# కల్లంలో ధాన్యం.. కళ్లల్లో దైన్యం



నల్గొండ : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు ధాన్యం కొనుగోళ్లకు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ఆయకట్టులోని త్రిపురారం, మిర్యాలగూడ, వేములపల్లితో పాటూ నల్గొండ, కనగల్, దేవరకొండ, సూర్యాపేట, జాజిరెడ్డిగూడెం, తుంగతుర్తి, భువనగిరి, ఆలేరు ప్రాంతాల్లో కోతలు పూర్తై రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తున్నారు. అయితే అధికారులు మాత్రం ఈ నెల 15 నుంచి కేంద్రాలను ప్రారంభిస్తామని వెల్లడించడంతో.. ప్రస్తుతమున్న వాతావరణ పరిస్థితులతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఇటీవలే కురిసిన వడగండ్ల వానకు ఉమ్మడి జిల్లాలో సుమారు 30 వేల ఎకరాల్లో పంట నష్టం జరగ్గా...తాజాగా సోమవారం సాయంత్రం సైతం అక్కడక్కడా వడగండ్ల వాన కురిసింది. దీంతో కల్లాల్లో ఉన్న ధాన్యం తడిసిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం ఈ యాసంగిలో 13.20 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. ఇది గతేడాదితో పోలిస్తే మూడు లక్షల ఎకరాలు అదనం. ఒక ఉమ్మడి జిల్లాలో ఇంత పెద్ద ఎత్తున విస్తీర్ణంలో వరి పంట సాగవడం రాష్ట్రంలోనే ప్రథమమని అధికారులు వెల్లడించారు. మొత్తం 33 లక్షల మెట్రిక్ టన్నుల వరకు దిగుబడులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో సగం మేర కొనుగోలు కేంద్రాలకు వచ్చినా.. తాము కొనేందుకు సిద్ధంగా ఉన్నామని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

ఏప్రిల్ నెలలో ప్రకృతి ప్రకోపం

ఏటా ఈ సీజన్‌లో ప్రకృతి ప్రకోపం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏప్రిల్ మొదటి వారం నుంచి పక్షం రోజుల పాటూ అకాల వర్షాలు, ఈదురుగాలులు, వడగండ్లు పడటంతో ఉమ్మడి జిల్లాలో ప్రతి యాసంగిలో రైతులకు పంటనష్టం కలుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీమా సౌకర్యం కల్పించకపోవడంతో వారికి ఆర్థికంగా నష్టం మిగులుతోంది. దీన్ని నివారించేందుకు ప్రభుత్వం సైతం యాసంగి సాగును ఒక నెల ముందుకు జరపాలని ప్రాథమికంగా నిర్ణయించింది. డిసెంబరు మొదట్లో వరి నాట్లు ప్రారంభించి, మార్చి చివరి నాటికి కోతలు పూర్తి చేస్తే ప్రకృతి సవాళ్లను తట్టుకోవచ్చని, ఈ కాలంలో ఆకాల వర్షాలు, ఈదురుగాలులు ఉండకపోవడంతో పంట నష్టమూ తగ్గుతుందని నిపుణుల అభిప్రాయం.

అయితే ఉమ్మడి జిల్లాలో బోరు, బావుల కింద సుమారు 20 శాతం మంది రైతులు మార్చి చివరి నాటికే కోతలు పూర్తి చేస్తున్నారు. ఏప్రిల్ చివరి నాటికి గానీ కొనుగోళ్ల ప్రారంభం కాకపోవడంతో కోతలు పూర్తి చేసినా వడగండ్లు, అకాల వర్షాల నుంచి తప్పించుకోలేకపోతున్నారు. గత రెండు మూడు రోజుల నుంచి వాతావరణ మార్పులతో వర్షాలు కురుస్తుండటంతో కోతలు పూర్తయిన రైతులు ప్రైవేటు వ్యాపారులకు ధాన్యాన్ని విక్రయిస్తున్నారు.

మార్గదర్శకాలపై లేని స్పష్టత

ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి మూడు జిల్లాల అధికారులకు ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి మార్గదర్శకాలు రాలేదని తెలిసింది. దీంతో మరో వారం రోజుల వరకు కొనుగోలు కేంద్రాల ప్రారంభం లేనట్లేనని సమాచారం. ఈ నెల 10న అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ డీఎంలు, మార్కెటింగ్ అధికారులతో హైదరాబాద్‌లో ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. దీంతో ఆ తర్వాతనే కొనుగోలు కేంద్రాల ప్రారంభం ఉంటాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే...

ఈ నెల 10న రాష్ట్ర స్థాయి సమావేశం అనంతరం ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే.. కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం. ఇప్పటికే నల్గొండ జిల్లాలో కోటిన్నర గన్నీ బ్యాగులను సిద్ధం చేశాం. మార్కెటింగ్ శాఖ సైతం కొనుగోళ్లకు సిద్ధంగా ఉంది. భాస్కర్‌రావు, అదనపు కలెక్టర్ (రెవెన్యూ), నల్గొండ

# ఎయిమ్స్‌కు ప్రధాని భూమి పూజ చేస్తారా?



నల్గొండ : బీబీనగర్ ఎయిమ్స్‌కు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 8న రానున్నట్లు విశ్వసనీయ సమాచారం. రాష్ట్ర పర్యటనలో భాగంగా రూ.11,355 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. సికింద్రాబాద్–తిరుపతి వందే భారత్ రైలు ప్రారంభం, రూ.715 కోట్లతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు, రూ.7,864 కోట్లతో నిర్మించే ఆరు హైవేలు, రూ.1366 కోట్ల చేపట్టే బీబీనగర్ ఎయిమ్స్ అభివృద్ధి పనులను ప్రారంభించి పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే సభలో మోదీ పాల్గొననున్నట్లు సమాచారం. ప్రధాని మోదీ తెలంగాణ పర్యటనకు సంబంధించి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తన ట్విటర్ ఖాతాలో పోస్ట్ చేశారు. బీబీనగర్ ఎయిమ్స్‌కు గతంలో కేటాయించిన నిధులకు తోడు ఇటీవల మరో రూ.312 కోట్లు కేటాయించిన విషయం విధితమే. ఎయిమ్స్ నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి కానీ భూమిపూజ కార్యక్రమం ఇప్పటి వరకు జరగలేదు. గత జనవరి నెలలో ప్రధాని తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా వందే భారత్ రైలును ప్రారంభించి బీబీనగర్ భూమిపూజలో పాల్గొంటారని అధికార వర్గాలు చెప్పినా.. అనివార్య కారణాలతో ప్రధాని పర్యటన రద్దయింది. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును వర్చువల్ ద్వారా ప్రారంభించారు కానీ ఎయిమ్స్ భూమిపూజ కార్యక్రమం చేపట్టలేదు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 8న బీబీనగర్ ఎయిమ్స్‌కు భూమి పూజ చేయనున్నట్లు తెలిసింది. దీనిపై ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియాను వివరణ కోరగా ప్రధాని పర్యటనపై అధికారికంగా స్పష్టత లేదని రెండు నెలల క్రితం పీఎంవో కార్యాలయం నుంచి సంబంధిత అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లారని తెలిపారు. అధికారికంగా ఖరారైతే సమాచారం అందజేస్తామని తెలిపారు. ఎయిమ్స్ ఆవరణలో పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. గుంతలు పడ్డ రోడ్లకు మరమ్మతులు చేస్తున్నారు. నాటేందుకు చదును చేస్తున్నారు.

# రుణం.. ప్రగతికి సోపానం

మెదక్: నిర్దేశించిన లక్ష్యం మేరకు గత ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలు రుణ లక్ష్యాలను పూర్తి చేసింది. అధికారులు ప్రణాళికతో ముందుకు సాగడంతో ఇది సాధ్యమైంది. తీసుకున్న వాటిని తిరిగి చెల్లిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న సంఘాలకు బ్యాంకర్లు పూచీకత్తు లేకుండానే సహకారం అందజేస్తున్నాయి. దీంతో చాలా సంఘాలు రుణాలను పొంది వాటిని వ్యాపారం నిర్వహణ, కుటుంబ అవసరాలకు వినియోగించుకుంటున్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు వ్యాపార రంగంలో ప్రవేశించేందుకు ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసింది. ఒక్కో సంఘంలో కనీసం పది మంది సభ్యులు ఉండేలా చర్యలు తీసుకున్నారు. వీటికి ఏటా సెర్ప్ రుణాలను అందజేస్తోంది. చాలా మంది మహిళలు స్వయం ఉపాధి వైపు మొగ్గుచూపుతూ, నచ్చిన రంగాన్ని ఎంపిక చేసుకుని ఆదాయం పొందుతున్నారు. నెలనెలా తిరిగి బ్యాంకుకు డబ్బులు చెల్లిస్తుండడంతో బ్యాంకర్లు కూడా సహకరిస్తున్నారు. రూ.587.77 కోట్లు పంపిణీ జిల్లాలో సెర్ప్ ద్వారా స్వయం సహాయక సంఘాలకు 2022–23 ఆర్థికసంవత్సరానికి 11,339 సంఘాలకు రూ.584.80 కోట్లు ఇవ్వాలని నిర్ణయించగా, 9,445 సంఘాలకు రూ.587.77 కోట్లు అందించారు. ఆర్థికసంవత్సరం మొదలైన నాటి నుంచి అధికారులు ప్రణాళికతో దీనిపై దృష్టి సారించారు. ప్రతి నెలా మండలాల వారీగా సమావేశాలను నిర్వహిస్తూ పర్యవేక్షించారు. ముందుగా రూ.392 కోట్లు ఇవ్వాలని నిర్ణయించగా, ఆ తర్వాత రూ.584.80 కోట్లకు పెంచారు. ఆర్థికసంవత్సరం ముగింపులోగా లక్ష్యాన్ని పూర్తి చేశారు.



పురపాలికల్లో రూ.43.13 కోట్లుజిల్లాలోని నాలుగు పురపాలికల్లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)ద్వారా 555 సంఘాలకు రూ.42.73 కోట్లను అందజేయాలని లక్ష్యం విధించగా, గడువులోపు 543 సంఘాలకు రూ.43.13 కోట్లను అందజేశారు. జిల్లా కేంద్రం మెదక్‌లో అత్యధికంగా రూ.16.15 కోట్లు ఇవ్వగా, తూప్రాన్‌లో రూ.11.82 కోట్లు ఇచ్చారు. అత్యల్పంగా నర్సాపూర్ పురపాలికలో నమోదైంది. పట్టణప్రాంతాల్లో సైతం మహిళలు వ్యాపారాల నిర్వహణకు, కుటుంబ అవసరాలకు ఈ రుణాలను సద్వినియోగం చేసుకుంటున్నారు.

ఆర్థిక స్వావలంబన దిశగా..

జిల్లాలో స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా ముందుకు సాగుతున్నారు. రుణాలను సద్వినియోగం చేసుకుంటూ, వ్యాపారాలను విస్తరిస్తున్నారు. కిరాణం, బేకరీ, టైలరింగ్ దుకాణాల నిర్వహణ, గేదేలు, మేకలను కొనుగోలు చేసి కుటుంబానికి చేదోడుగా నిలుస్తున్నారు. వారు తయారు చేసిన వస్తువులను మంజీరా మార్ట్‌ల పేరిట మండలాల వారీగా దుకాణాలను ఏర్పాటు చేసి విక్రయాలు నిర్వహిస్తున్నారు.

# అంతర పంట.. ఆదాయం భళా

ఊట్కూరు : ఏటా రెండు సీజన్లలో కూడా పత్తి, కంది పంటలు సాగుచేస్తూ ఆ రైతు నష్టాలే చవిచూశారు. తక్కువ పెట్టుబడితో దీర్ఘకాలం దిగుబడి వస్తుందని ఉద్యాన అధికారులు చెప్పడంతో ఆయిల్ పామ్ సాగు చేశారు. దిగుబడి వచ్చే వరకు ఆలస్యం కానుండటంతో తక్షణ ఆదాయం కోసం అంతర పంటగా కూరగాయలు, ఆకుకూరలు సాగుచేస్తూ లాభాలు గడిస్తున్నారు యువరైతు నర్సప్ప.

నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలంలోని బిజ్వార్ గ్రామానికి చెందిన పట్నం నర్సప్ప ఐటీఐ, డిగ్రీ పూర్తి చేశారు. ఒక్కడే కుమారుడు కావడంతో తండ్రి నుంచి వచ్చిన ఎనిమిది ఎకరాలు సాగుచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వరి, పత్తి, కంది పంటలు సాగు చేశారు. అయితే పత్తికి ధరలు స్థిరంగా లేకపోవడం, అతివృష్టి, అనావృష్టి కారణంగా బాగా నష్టాలు వచ్చాయి. కంది దిగుబడి కూడా అంతంత మాత్రంగానే వచ్చింది. దీంతో ఉద్యానశాఖ అధికారుల సూచన మేరకు 14 నెలల కిందట మూడెకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. దిగుబడి రావడానికి మూడేళ్ల సమయం పడుతుండటంతో అంతర పంటగా వివిధ రకాల కూరగాయలు సాగుచేసి ఆదాయం గడిస్తున్నారు.

కూరగాయలతో రూ.90 వేలు.. : కూరగాయల సాగుతో ఆరు నెలల్లో రూ.90 వేల ఆదాయం పొందుతున్నారు రైతు నర్సప్ప. కేవలం పావు ఎకరంలో సాగుచేసిన మిర్చితోనే రూ.60 వేలకు పైగా ఆదాయం గడించారు. ప్రతిరోజూ తెంచిన మిర్చిని సొంతంగా సంతలకు తరలించి విక్రయిస్తున్నట్లు రైతు నర్సప్ప తెలిపారు. నాణ్యమైన



కూరగాయల విత్తనాలు గద్వాల, కర్నూలు నుంచి కొనుగోలు చేసి తెచ్చుకున్నట్లు చెప్పారు. టమాట విత్తనాలు, కూలీల ఖర్చు పోను అర ఎకరాకు రూ.30 వేల వరకు ఆదాయం వచ్చిందని చెప్పారు. గతేడాది మంచి ధరలు ఉండటంతో కేవలం అర ఎకరంలోనే రూ.2 లక్షల వరకు ఆదాయం పొందినట్లు తెలిపారు. రెండెకరాల్లో ఆయిల్ పామ్ తోట సాగుకు ప్రభుత్వం నుంచి మొదటి ఏడాది రూ.52 వేలు ప్రోత్సాహకం అందనుంది. దీంతోపాటు మొక్కల మధ్య పొలం వృథాగా ఉండకుండా అంతర పంటగా టమోటా, వంకాయ, బీరకాయ, మిర్చి సాగు చేయడంతో రైతు అదనపు ఆదాయం పొందుతున్నారు. మార్కెట్ డిమాండును బట్టి కూరగాయలు సాగు చేస్తే మంచి లాభాలు వస్తాయంటున్నారు.

సందేహాలా.. సంప్రదించండి

బిజినేపల్లి : సాగులో రైతులకు ఎదురవుతున్న సమస్యలు, ఎరువులు, చీడపీడల యాజమాన్యంపై నెలకొన్న సందేహాలను నివృత్తి చేసేందుకు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) సమన్వయకర్త డా. ప్రభాకర్‌రెడ్డి ముందుకు వచ్చారు. మినహా మిగతా రోజుల్లో ఉదయం 11గంటల నుండి 12 గంటల మధ్య సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

## ఆసాంతం వివాదం.. బందెప్ప వ్యవహారం

వికారాబాద్ : టెన్త్ పరీక్ష ఇలా మొదలైందో లేదో కొద్ది నిమిషాల వ్యవధిలోనే ప్రశ్నపత్రం బయటకు వచ్చేసింది. అత్యంత కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేశామని చెబుతున్న చోటు నుంచే ఏకంగా వాట్సాప్‌లో అది ప్రత్యక్షమైంది. తాండూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (నం.1) కేంద్రంగా బందెప్ప అనే ఉపాధ్యాయుడి నిర్వాకం ఇందుకు కారణమైంది. ఒక్కసారిగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థుల తల్లిదండ్రుల్లోనూ ఆందోళన మొదలైంది. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ అంశమై తీవ్రస్థాయిలో చర్చ సాగుతున్న ఈ తరుణంలోనే చివరకు పదో తరగతి ప్రశ్నపత్రాలనూ ఇలా బయటకు తెస్తే ఏంటనే ఆందోళన మొదలయ్యింది. ఆదర్శంగా నిలవాల్సిన ఉపాధ్యాయుడే ఈ పని చేశాడని తెలిసి అందరూ ఆయన తీరును తప్పుపడుతున్నారు. ఈ విషయం బయటకు పొక్కడంతో ఎవరీ బందెప్ప అనే చర్చ మొదలుకావడంతో గతంలోనూ ఆయన పై ఉన్న ఆరోపణలు మరోసారి బహిర్గతమయ్యాయి.

చీటీల పంపిణీకి యత్నం

తాండూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల(నం.1) వివాదాలకు నిలయంగా మారింది. రెండేళ్ల క్రితం పదోతరగతి పరీక్షల సమయంలో బయటి వ్యక్తులు చీటీలు అందించటానికి నానా హంగామా చేశారు. చీటీల అందజేత హంగామాపై 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీంతో విద్యాధికారులు స్పందించారు. అప్పటి నుంచి పాఠశాల ఆవరణలోని మరో భవనంలో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

తొలుత ఉత్తిదేనంటూ కొట్టివేత

ఉదయం 9.37గంటలకే ప్రశ్నపత్రం సమ్మప్ప వాట్సాప్‌కు చేరింది. అదే సమయంలో లోకల్‌గా ఉన్న మరో గ్రూప్‌లోనూ పొరపాటున పోస్ట్ చేశాడు. విషయం వెలుగులోకి రావడంతో ఇదే విషయమై మండల విద్యాధికారి వెంకటయ్య దృష్టికి కొందరు తీసుకెళ్లగా తొలుత అలాంటిదేమీ లేదన్నారు. చివరకు వాస్తవం గ్రహించి పోలీసులు రంగంలోకి దిగారు. తొలుత ఒక గ్రూప్‌లో పోస్ట్ చేసి డిలీట్ చేయడంతో ఆ సమాచారం ఆధారంగా బందెప్పను అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. దీంతో బండారం బయటపడింది.

ఆరోపణలొచ్చినా అక్కడే

ప్రభుత్వ ఉన్నత పాఠశాల (నం.1)లో చదివే ఒక బాలిక బందెప్ప తనను లైంగికంగా వేధిస్తున్నాడని గతంలో ఫిర్యాదు చేసింది. 2017లో వెలుగు చూసిన ఈ ఘటనపై ఆయనపై అప్పట్లోనే పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. సస్పెన్షన్ వేటు పడకుండా వ్యవహారం చక్కబెట్టుకున్న బందెప్ప అప్పటి నుంచి ఇదే పాఠశాలలో కొనసాగుతున్నారు. కేసు విచారణ దశలో ఉంది. సోమవారం తెలుగు పరీక్ష ఉండగా.. ఆయనను రిలీవర్‌గా ఉంచారు. అయిదో నంబరు గదిలో ఇన్విజిలేటర్‌గా ఉన్న శ్రీనివాస్ అనే ఉపాధ్యాయుడి నుంచి చాకచక్యంగా ప్రశ్నపత్రాన్ని తీసుకున్న బందెప్ప.. ఆ వెంటనే ఫొటో తీసి సమ్మప్పకు పంపాడు. చెంగోల్ పాఠశాలలో ఫిజికల్ సైన్స్ టీచర్‌గా పనిచేస్తున్న సమ్మప్ప తనకు తెలిసిన విద్యార్థులకు లాభం జరిగేందుకే ప్రశ్నపత్రాన్ని బయటకు పంపినట్లు పోలీసులు తేల్చారు. అందుకే బందెప్పతో పాటు సమ్మప్పనూ సస్పెండ్ చేసిన అధికారులు క్రిమినల్ చర్యలకూ సిద్ధమయ్యారు.

# సింగరేణి ఎన్నికలపై ఉత్కంఠ

జయశంకర్ : సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ ఖరారు చేశారు. కార్మిక శాఖ ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తోంది. ఇప్పటికే కార్మిక సంఘాల నుంచి నామినేషన్లు స్వీకరించింది. అలాగే మరోవైపు యాజమాన్యం కోర్టును ఆశ్రయించగా పిటిషన్ 11కు వాయిదా వేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో గుర్తింపు సంఘం ఎన్నికలపై ఉత్కంఠ నెలకొంది.. కోర్టు ఎన్నికల నిర్వహణపై ఎలాంటి ఆదేశాలు ఇస్తుందో వేచిచూడాలి. సింగరేణి ఎన్నికల ప్రకారం 9వ తేదీ నుంచి హైదరాబాద్‌లోని కేంద్ర కార్మిక శాఖ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తున్నారు. శుక్రవారం దాదాపు 12 సంఘాలకు చెందిన అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశాయి. మరో రెండు సంఘాలు కూడా నామినేషన్ వేశాయి. నోటిఫికేషన్ ప్రకారం సింగరేణి వ్యాప్తంగా ఈ నెల 28వ తేదీన ఎన్నికలు నిర్వహించాలి. అదేరోజు ఫలితాలు వెల్లడించాల్సి ఉంటుంది. కార్మిక శాఖ ఎన్నికల ప్రక్రియను



యథావిధిగా నిర్వహిస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకే యాజమాన్యం ఎన్నికలను వాయిదా వేసేందుకు ప్రయత్నిస్తోందని పలు కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.

నాలుగేళ్లుగా వాయిదా వేస్తున్నారు..- కొరిమి రాజ్‌కుమార్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలను ఈ సారి తప్పకుండా నిర్వహించాలి. ప్రతి రెండేళ్లకోసారి నిర్వహించాల్సిన ఎన్నికలు దాదాపు నాలున్నరేళ్లుగా వాయిదా పడుతూ వస్తున్నాయి. యాజమాన్యం సహకరించడం లేదు. కార్మికుల సమస్యలు పరిష్కరించుకోవడానికి సహకరించే గుర్తింపు సంఘం ఎన్నికలను వాయిదా వేస్తూ పోతే గుర్తింపునకు అర్థమే లేకుండా పోతుంది.

ఎప్పుడైనా సిద్ధమే.. -బడితల సమ్మయ్య, తెబొగకాసం నాయకులు

తెబొగకాసం కూడా నామినేషన్లు దాఖలు చేసింది. గుర్తింపు ఎన్నికలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించినా సిద్ధమే. కానీ, ప్రభుత్వ యంత్రాంగం అవసరమైన సిబ్బంది, భద్రత, తదితర అంశాలను సమకూర్చాల్సి ఉంటుంది. అలాగే ఉత్పత్తి, ఇలాంటి వాటిని దృష్టిలో పెట్టుకోవాలి. యాజమాన్యం కోర్టుకు వెళ్లింది.. 11న పూర్తి స్పష్టత వస్తుంది.

# మానవత్వం విడిచి.. అనుబంధాలు మరిచి!

మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లాలో భూ వివాదాలు సమస్యాత్మకంగా మారుతున్నాయి. అన్నదమ్ములు, దాయాదులు.. రక్త సంబంధాన్ని మరచి పరస్పరం దాడులకు పాల్పడుతున్నారు. సమస్య తీవ్రమైనప్పుడు హత్యలకు దారితీసి ప్రాణాలు పోతున్నాయి. గతంలో రూ.వేలల్లో ధర ఉన్నప్పుడు అంతగా గొడవలు జరిగేవి కావు. అన్నదమ్ములు, దాయాదుల మధ్య గొడవ జరిగితే బంధువులు, గ్రామ పెద్దలు సర్దిచెప్పేవారు. ధరలు పెరిగాక పరిస్థితి పూర్తిగా మారింది. డబ్బుపై ఆశ పెరిగింది. భూముల పంపకాల్లో తేడాలు, కుటుంబ సభ్యుల్లో సఖ్యత లేకపోవడం, న్యాయస్థానాల్లో కేసులు వేయడం, త్వరగా సమస్య పరిష్కారం కాకపోవటం, ఆర్థిక అవసరాలు తదితర కారణాల వల్ల హత్యలు, హత్యాయత్నాలు జరుగుతున్నాయి. ఫలితంగా కుటుంబాలు వీధినపడుతున్నాయి.

మచ్చుకు కొన్ని ఘటనలు..

వనపర్తి మండలం రాజపేట పెద్ద తండాకు చెందిన ఎంపీవో బద్రీనాథ్ నాయక్, అతడి నలుగురు అన్నదమ్ముల మధ్య భూముల పంచాయతీ కొనసాగుతోంది. న్యాయస్థానంలో తనకు అనుకూలంగా తీర్పు రావచ్చుని భావిస్తున్న బద్రీనాథ్ దారుణంగా హత్యకు గురయ్యారు. ఈ నెల 4న వనపర్తి కలెక్టరేట్ నుంచి బయటకు వస్తుండగా కత్తులతో దాడి జరిగింది.

గండీడ్ మండలంలోని ఓ గ్రామంలో పెద్ద నాన్నను ఓ యువకుడు గతేడాది హత్య చేశాడు. రెండు కుటుంబాలకు కలిపి 1-20 ఎకరాల భూమి ఉంది. ఐదేళ్లుగా వివాదం కొనసాగుతోంది. మేజర్ అయ్యాక తమ్ముడి కుమారుడు తన వాటా భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని కోరగా పెద్ద నాన్న తిరస్కరించాడు. ఓ రోజు పొలంలో పడుకున్న పెద్దనాన్నను కర్రతో కొట్టి చంపాడు.

నవాబ్‌పేట మండలంలోని ఓ గ్రామంలో అన్నదమ్ముల మధ్య మూడెన్నర ఎకరాల భూమిపై చాలా ఏళ్లుగా వివాదం కొనసాగుతోంది. ఈ ఏడాది మే 10న పొలం వద్ద అన్నదమ్ములు కొట్టుకున్నారు. ఒకరి గొంతును మరొకరు కోశారు. తీవ్రంగా గాయపడ్డ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స తర్వాత కోలుకున్నాడు. అతడిపై హత్యాయత్నానికి పాల్పడిన వారు జైలుకు వెళ్లారు.

మహబూబ్‌నగర్‌కు కూత వేటు దూరంలో ఉన్న మండలంలోని ఓ గ్రామంలో సొంత కుమారుడినే తండ్రి హత్య చేశాడు. తండ్రికి 3.10 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అతడికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. భూమిని కుమారులకు సమానంగా పంచుదామని భావించిన తండ్రికి లారీ డ్రైవరైన పెద్ద కొడుకు అడ్డు పడేవాడు. భూమి మొత్తం అమ్మి తనకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఈ క్రమంలో తండ్రి.. అర్ధరాత్రి ఇంట్లో పడుకున్న కుమారుడిపై గొడ్డలితో దాడి చేసి ప్రాణాలు తీశాడు.

కేసులన్నీ జాగాలవే..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఠాణాలకు వస్తున్న ఫిర్యాదుల్లో భూ వివాదాలవే ఎక్కువగా ఉంటున్నాయి. కొన్నిచోట్ల పోలీసులు నిబంధనలకు విరుద్ధంగా భూ వ్యవహారాల్లో తలదూరుస్తున్నారు. ప్రధానంగా జాతీయ రహదారులకు పక్కన, హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న మండలాలు, నీటి లభ్యత ఎక్కువగా ఉన్న, పరిశ్రమలు ఏర్పాటవుతున్న ప్రాంతాల్లో భూములకు డిమాండ్ ఎక్కువగా ఉంది. ఎకరం కనీసం రూ.50లక్షల నుంచి రూ.5కోట్ల ధర పలుకుతోంది. పారిశ్రామికవేత్తలు, రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు ఈ భూములను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. వివాదాలు ఉన్న భూములు తక్కువ ధరకే వచ్చే అవకాశం ఉండటంతో వాటిని కొనుగోలు చేస్తున్నారు. చాలా కుటుంబాల్లో గొడవలకు వారే కారణం అవుతున్నారు. వాటాల విషయంలో విభేదాలు వచ్చి గొడవలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. ఫలితంగానే హత్యలు జరుగుతున్నాయి.

# ఏళ్ల నాటి కల సాకారం..!



ములుగు : ఏళ్ల నాటి కళ సాకారమైంది. ఏటూరునాగారం ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది. రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత కొత్త జిల్లాల ఏర్పాటు చేశారు. ఇదే క్రమంలో ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని జిల్లా నుంచి నిరసనలు, వినతులు వెల్లువెత్తాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసి అభ్యంతరాలు స్వీకరించేందుకు 15 రోజుల గడువు విధించింది.

ఆందోళనలు.. వినతులు

ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏటూరునాగారంను రెవెన్యూ డివిజన్ చేయాలని ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. భాజపాకు చెందిన నాయకుడు 24 గంటల నిరసన దీక్ష సైతం చేశారు. గతేడాది వరదల సమయంలో ఏటూరునాగారం ప్రాంతానికి వచ్చిన సీఎం కేసీఆర్‌కు రెవెన్యూ డివిజన్ డిమాండును ప్రతిపక్ష పార్టీల ప్రతినిధులు వివరించారు. తరచూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించిన సందర్భాలు అనేకం. ఇటీవల మంత్రి హరీశ్‌రావు ములుగు పర్యటనకు వచ్చినప్పుడు అధికార పార్టీ నాయకులు డివిజన్ ఏర్పాటుపై విన్నవించారు.

ఆరు మండలాలతో..

2019 ఫిబ్రవరి 17న తొమ్మిది మండలాలతో ములుగు జిల్లా ఏర్పడింది. ఈ మండలాలన్నీ ఒకే ఒక్క ములుగు రెవెన్యూ డివిజన్ పరిధిలోనే ఉన్నాయి. కొత్తగా మల్లంపల్లి మండలం ఏర్పాటుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. జిల్లాలో మొత్తం 10 మండలాలు ఉండగా, ఇందులోంచి ఏటూరునాగారం కేంద్రంగా తాడ్వాయి, ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం ఆరు మండలాలను కలుపుకొని కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. విభజన తర్వాత ఈ డివిజన్ పరిధిలో మొత్తం ఆరు మండలాలుండగా, వీటి పరిధిలో 101 గ్రామ పంచాయతీలు, 293 రెవెన్యూ గ్రామాలు ఉండనున్నాయి. 3,197 స్క్వేర్ కిలోమీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు కానుంది. ఈ డివిజన్‌లో 1,69,033 జనాభా ఉండనుంది.

నాలుగు మండలాలకు పరిమితం


ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్ ఏర్పాటైన తర్వాత గోవిందరావుపేట, వెంకటాపూర్ ములుగు, మల్లంపల్లి(కొత్తగా ఏర్పడిన మండలం) మండలాలకు ములుగు రెవెన్యూ డివిజన్ పరిమితం కానుంది. దీని పరిధిలో 73 పంచాయతీలు, 43 రెవెన్యూ గ్రామాలు, 684 స్క్వేర్ కిలోమీటర్ల విస్తీర్ణంతో 1,25,638 జనాభాతో ఉంటుంది.

చాలా సంతోషంగా ఉంది- బడే నాగజ్యోతి, తాత్కాలిక జడ్పీ ఛైర్‌పర్సన్, ములుగు

చాలా సంతోషంగా ఉంది. ములుగు జిల్లాపై కేసీఆర్‌కు ఉన్న ప్రేమకు తార్కాణం. జిల్లాపై సీఎం వరాల జల్లు కురిపిస్తున్నారు. ప్రజాభీష్టం మేరకు జిల్లా, మల్లంపల్లి మండలం, మెడికల్ కళాశాల, ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయడమనేది ముఖ్యమంత్రి కేసీఆర్‌కే చెల్లింది.

భారాస నాయకుల సంబరాలు రెవెన్యూ డివిజన్ ప్రకటించినందుకు భారాస నాయకులు సంబరాలు చేసుకున్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద టపాసులు పేల్చారు. జడ్పీ ఛైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, భారాస ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌రావు, మండలాధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తుది ఓటరు జాబితాలో తప్పులు




జనగామ : రానున్న అసెంబ్లీ ఎన్నికలకు ఓటర్ల తుది జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం వెల్లడించింది. జిల్లాకు సంబంధించిన ఓటరు జాబితాను కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అధికారికంగా ప్రకటించారు. మే 25న విడుదలైన ప్రణాళిక ప్రకారం పోలింగ్ కేంద్రాల గుర్తింపు, నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఓటరు జాబితా సవరణ, ముసాయిదా జాబితా విడుదల, జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ, ప్రత్యేకంగా ఓటు నమోదు శిబిరాల నిర్వహణ, ఓటు నమోదులో తొలగింపులు, మార్పులకు దరఖాస్తుల స్వీకరణ.. తదితర కార్యక్రమాలను నాలుగు నెలల పాటు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మూడు నియోజకవర్గాల్లో సెప్టెంబర్ 19వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించి, 28 వరకు వచ్చిన వాటిపై విచారణ జరిపి అంతర్జాలంలో నిక్షిప్తం చేశారు. దాని ఆధారంగా తుది ఓటరు జాబితాను రూపొందించారు. జిల్లాలో 4,11,314 మంది ఓటర్లు ఉన్నారు. తాజాగా విడుదలైన జాబితాలో ఏమైనా తప్పులు దొర్లాయా? కొత్త ఓటరుగా దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు జాబితాలో ఉన్నాయా? లేదా? తదితర విషయాలపై ‘ జనగామ, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాల్లోని పోలింగ్ బూత్‌లలో పరిశీలన చేపట్టింది వివరాలు ఇలా..!మరణించిన వారి పేర్లు కూడా..పాలకుర్తికి చెందిన కె.వెంకటేశ్వర్లు అనారోగ్యంతో మూడేళ్ల క్రితం మరణించాడు. అయినప్పటికీ ఓటరు జాబితాలో ఆయన పేరు వచ్చింది. ఎ.స్రవంతితో పాటు ఇ.నరేశ్‌కు తలో రెండు రెండు ఓట్లు జాబితాలో ప్రచురితమయ్యాయి. గతంలో కూడా వారికి రెండేసి ఓట్లు ఉండేవని, బీఎల్‌వోలు, అధికారులు సరి చేయకుండా కాలయాపన చేశారని తెలుస్తోంది. అలాగే పలువురు స్థానికంగా ఉండని వారి పేర్లు కూడా జాబితాలో ఉన్నాయని ఓ నేత తెలిపారు. ఇలాంటి తప్పులు చాలా వరకు ఉన్నాయని, వెంటనే సరిచేయాలని ఆయన కోరారు. చనిపోయిన వారి పేర్లు కూడా కొత్త జాబితాలో వచ్చాయని పలువురు తెలిపారు. వీటిపై తహసీల్దార్ వెంకటేశంను వివరణ కోరగా.. ఈసారి చాలా వరకు తప్పిదాలు లేవన్నారు. చనిపోయిన వారి పేర్లను పాలకుర్తి మండలంలోనే సుమారు 900 వరకు తొలగించినట్లు వెల్లడించారు.

కనిపించని జాబితాలు

జనగామ పట్టణం 26వ వార్డులోని ఒకరి ఇంట్లో మూడు ఓట్లు ఉండగా ఒకరి ఓటు ఓ చోట, ఇద్దరి ఓట్లు మరో చోట నమోదయ్యాయి. ఇదే వార్డుకు చెందిన ఒకరి కుటుంబంలోని ఓట్లు ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రానికి మారాయి. తాజాగా విడుదలైన ముసాయిదాలో ఎక్కువగా మరణించిన వారి ఓట్లే ఉన్నాయి. కొత్తగా నమోదు చేసుకున్న వారికి గుర్తింపుకార్డులు అందిస్తున్నారు. గతంలో ఓటరు జాబితాలో ఉన్న వారి గుర్తింపుకార్డు నెంబర్ మారినట్లు పరిశీలనలో తేలింది. ఇంకా చాలా చోట్ల తుది జాబితా ఆయా బూత్‌స్థాయి అధికారులకు చేరలేదు. ఏ పోలింగ్ కేంద్రం వద్ద తుది జాబితాను ప్రదర్శించలేదు.

రెండు సార్లు నమోదుజఫర్‌గఢ్ మండలంలో 31,994 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో చాలా మంది ఓటర్లు ఓటరు జాబితాలో తమ పేర్లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. తమ్మడపల్లి(జి)కి చెందిన మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ అన్నం బ్రహ్మారెడ్డి పేరును 288 బూత్ ఓటరు జాబితాలో రెండు సార్లు నమోదు చేశారు. ఉప్పుగల్లు, తీగారం, జఫర్‌గఢ్, తిమ్మంపేట, సూరారం, రఘునాథపల్లి, కూనూర్, తదితర గ్రామాల్లో ఒక్కో గ్రామంలో 30కి పైగా ఓటర్ల పేర్లు జాబితాలో లేవని చెప్పారు. ఎన్నికల సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తాము ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉందని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

# పరిశుభ్రతతోనే వ్యాధులకు అడ్డుకట్ట..!

జనగామ : మారిన వాతావరణ పరిస్థితులతో జిల్లాలోని పలు గ్రామాల్లో కొన్ని రోజులుగా పలు వ్యాధులు ప్రబలుతున్నాయి. కొందరు జ్వరాలతో మంచం పడుతున్నారు. దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులతో బాధ పడుతున్నారు. వైద్యం కోసం ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయి స్తున్నారు. ఆసుపత్రులన్నీ జ్వర బాధితులతో కిటకిటలాడుతున్నాయి ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో నిర్వహించిన వైద్య శిబిరాలకు మంచి స్పందన వచ్చింది. పలువురు బాధితులు తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు వారిని పరీక్షించి మందులు అందజేశారు. కొందరికి జ్వరం సోకినట్లు నిర్ధారించారు. పది మందికి జ్వరంపాలకుర్తి మండలం ముత్తారం శివారులోని దంతాలతండాలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యుడు యేల అనీల్ 45 మందిని పరీక్షించారు. 10 మందికి జ్వర లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. బాధితులకు మందుల అందజేశారు. కాచి చల్లార్చిన నీటిని నిత్యం తాగాలని, వేడిగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలని గ్రామస్థులకు సూచించారు.

రక్త నమూనాల సేకరణ

వడ్లకొండలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కోమాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అబ్బు మధుకర్‌యాదవ్ రోగులను పరీక్షించారు. డెంగీ, మలేరియా నివారణకు చేపట్టాల్సిన పనులు, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. శిబిరానికి 70 మంది తరలివచ్చారు. బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించి, 10 మంది రక్త నమునాలను సేకరించారు. అవసరార్థులకు మందులు అందజేసి, ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచి బొల్లం శారద, వైద్యులు ఎంఎల్‌హెచ్‌పీ నమృత, ఏఎన్ఎంలు కవిత, శారద పాల్గొన్నారు.

# గుట్టల మట్టి మాయం

నాగర్‌కర్నూల్ : బిజినేపల్లి మండల పరిధిలోని గుట్టల నుంచి మట్టి అక్రమ తరలింపు యథేచ్ఛగా కొనసాగుతోంది. ఫిర్యాదులు చేసినప్పుడు కొద్ది రోజులు ఆపేస్తూ తిరిగి ఈ తరలింపు రెట్టింపు స్థాయిలో కొనసాగిస్తున్నారు. ఇప్పటికే పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు కింద నిర్మిస్తున్న వట్టెం జలశయం దగ్గరలో ఉన్న మట్టి గుట్టలు మాయమయ్యాయి. ప్రాజెక్టు పనులు పొందిన గుత్తేదారులు ఈ గుట్టలను ఖాళీ చేశారు. పర్యావరణానికి ముప్పుగా మారుతున్నప్పటికీ అధికారులు కనీస చర్యలు చేపట్టడం లేదు.

కాలువల వెంట సైతం.. : బిజినేపల్లి మండలంలోని గుట్టలతో పాటు కేఎల్‌ఐ కాలువపై ఉన్న మట్టి ఖాళీ అయింది. వట్టెం వేంకటేశ్వరస్వామి ఆలయం చుట్టూ మట్టిని తీశారు. ప్రస్తుతం మన్యానాయక్ తండా వద్ద ఉన్న గుట్టకు పొక్లెయిన్లతో మట్టిని తవ్వుతున్నారు. సమీపంలో ప్రాజెక్టు పనులు చేస్తున్న గుత్తేదారులు నిరంతరం టిప్పర్లతో మట్టిని తరలిస్తున్నారు. యువకులు అడ్డుకునే ప్రయత్నం చేసినా ఆగటం లేదు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద 29వ ప్యాకేజీ కాలువ



వెంట ఉన్న మట్టిని తీసుకెళ్లారు. ఇదే మండలంలోని గురుకుల పాఠశాల వద్ద ఉన్న గుట్టకు ఎసరు పెట్టారు. రోడ్డు వేసే గుత్తేదారులు, ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టే గుత్తేదారులు, మట్టి వ్యాపారులు ఇలా అందరు గుట్టలపై కన్నేశారు. ప్రభుత్వానికి పైసా పన్ను కట్టకుండా మట్టిని తరలించుకుపోతున్నారు. ఒక్క బిజినేపల్లి మండలంలోనే 50 ఎకరాల వరకు ఉన్న గట్టలు చదునుగా మారిపోయాయి.

ఎర్రమన్ను గుట్ట నుంచి వేల ట్రిప్పుల తరలింపు: నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తి సమీపంలో ఉన్న ఎర్రమన్ను గుట్ట నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నారు. ఇక్కడి నుంచి వేల ట్రిప్పుల మట్టి తరలిపోయింది. సగం గుట్ట ఖాళీ అయింది. రెండు రోజుల క్రితం నాగర్‌కర్నూల్ మండలం శ్రీపురం వద్ద మట్టిని తరలిస్తున్న టిప్పర్ కింద పడి ఓ మహిళ మృతి చెందింది. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. మట్టి తరలింపునకు ఎలాంటి అనుమతులు లేవని బిజినేపల్లి తహశీల్దార్ రాములు పేర్కొన్నారు. రెవెన్యూ సిబ్బందితో వెళ్లి పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

# చినుకు లేక.. చింత !

వనపర్తి : వర్షాధారంగా సాగు చేసిన మెట్ట పంటలను వర్షం దెబ్బ తీసింది. సకాలంలో వానల్లేక వేసిన పంటలు చేతికి అందివస్తాయో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలం ప్రారంభమై 125 రోజులు దాటినా జిల్లాలో కేవలం 30 రోజులు మాత్రమే వర్షం కురిసింది. వర్షాలు ఆలస్యంగా కురవడంతో రైతులు పత్తి, వేరుశనగ, జొన్న, మొక్కజొన్న, ఆముదం, కంది పంటలను ఆలస్యంగా సాగు చేశారు. కొన్నిరోజులు వర్షాలు అధికంగా కురవడంతో పంటలు పండుతాయని రైతులు సంతోషించారు. జూన్‌లో 5 రోజులు, జులైలో 14 రోజులు ఆగస్టులో 4 రోజులు, సెప్టెంబరులో 7 రోజులు మాత్రమే వర్షం కురిసింది. ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 510.4 మి.మీ. కాగా 520.8 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో సాధారణంగా కురవాల్సిన వర్షం కంటే 2.03 మి.మీ. వర్షం అధికంగా నమోదైంది. సరైన సమయంలో వర్షం కురవక పోవడంతో చెరువులు, కుంటలు నిండలేదు. కేవలం కల్వకుర్తి ఎత్తిపోతల పథకం నుంచి కాలువల ద్వారా నీటిని తరలించి చెరువులు, కుంటలను నింపారు. ఖరీఫ్‌లో అన్ని పంటలు కలిపి సెప్టెంబరు చివరి నాటికి 2,28,872.18 ఎకరాల్లో సాగు చేశారు. కేవలం వరిపంట ఒక్కటే 1,87,544.06 ఎకరాల్లో సాగైంది.

పంటల పరిస్థితి ఇలా..

జిల్లాలో వర్షాధారంగా జొన్న కేవలం 775.12 ఎకరాల్లో మాత్రమే సాగైంది. వర్షాల్లేక వేసిన పంట చాలా చోట్ల ఎండిపోయింది. అక్కడక్కడ



మిగిలిన పంటను రైతులు కోస్తున్నారు.

మొక్కజొన్నను 11,110.35 ఎకరాల్లో సాగుచేశారు. పైర్లు పెరిగి పెద్దవి కాకముందే ఎండకు వాడిపోయాయి. అడపాదడపా కురిసిన వర్షాలకు కొన్నిచోట్ల కంకులు వచ్చాయి. కొందరు రైతులకు పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి కనిపించడం లేదు.

జిల్లా మొత్తంగా 3,954 ఎకరాల్లో కంది సాగు చేశారు. ఈ పంట ఆశించినంతగా లేదు. కందులు ఇంటికి వస్తాయనే నమ్మకం లేదని రైతులు చెబుతున్నారు. సెప్టెంబరు చివరి నాటికి జిల్లాలో 5112.14 ఎకరాల్లో వేరుశనగను వర్షాదార పంటగా సాగుచేశారు. పంటలు ఎండిపోతున్న దశలో రైతులు తుంపర పరికరాలతో నీటిని అందిస్తున్నారు. బోర్లు ఉన్న రైతులు ఎలాగోలా పంటను కాపాడుకోవాలని విశ్వప్రయత్నం చేస్తున్నారు. పైపులైన్ల ద్వారా నీటిని తరలించి పంటను కాపాడుకుంటున్నారు. 17,421.14 ఎకరాల్లో పత్తి సాగైంది. వర్షాలు ఆలస్యం కావడంతో కొందరు రైతులు తుంపర పరికరాలతో పొలాలను తడిపి విత్తనాలు వేశారు.

పెట్టుబడి వస్తే.. అదే పదివేలు

నాలుగెకరాల్లో వర్షాధారంగా వేరుశనగ సాగు చేశాను. వర్షాలు సకాలంలో కురవక పైరు ఎదగలేదు. ఇప్పుడు ఆకులపై మచ్చల తెగులు వస్తోంది. ఉన్న ఒక్క బోరునీటిని ఉపయోగించి పైరుకు నీటిని అందిస్తున్నా. తుంపర పరికరాలను కొనాల్సి వచ్చింది. లాభాలు దేవుడెరుగు, పెట్టుబడి డబ్బులు వస్తే చాలనిపిస్తోంది.

సిద్ధి చిన్నయ్యయాదవ్, బుద్దారం

కొన్ని చోట్ల ఎండిపోయాయికేవలం వర్షాధారంగా పైర్లు వేసిన రైతులు వాటికి నీటిని అందిస్తే పంటలు చేతికి వస్తాయి. కొన్నిచోట్ల వర్షాభావ పరిస్థితుల కారణంగా పైర్లు ఎండిపోయాయి. రైతులు పెట్టుబడి కూడా నష్టపోయినట్లే. కొందరు బోర్ల నీటిని, కాలువల నీటిని అందించి పంటను కాపాడుకున్నారు. పంటల దిగుబడి తగ్గుతుంది. లాభాలు రాకపోయినా పెట్టుబడి డబ్బులు తప్పకుండా వస్తాయి.సుధాకర్‌రెడ్డి, జిల్లావ్యవసాయాధికారి

# బిల్లులు రాక.. పనులు సాగక

సిరిసిల్ల : ముస్తాబాద్ మండలం పొత్గల్ ప్రాథమిక పాఠశాలకు తాగునీటి సరఫరా, గదుల మరమ్మతు, విద్యుత్తు సరఫరా పనులు మంజూరయ్యాయి. గుత్తేదారు తాగునీటి సంపునిర్మాణం మాత్రమే చేశారు. బిల్లులురాక మిగతా పనులు చేయడం లేదు. ప్రభుత్వ పాఠశాలకు కార్పొరేట్ స్థాయి వసతుల కల్పనకు 'మన ఊరు–మన బడి' కార్యక్రమాన్ని 2022, మార్చి నెలలో ప్రారంభించింది. నిరంతర నీటి సరఫరా, మరుగుదొడ్లు, విద్యుద్దీకరణ, తాగునీరు, ఫర్నీచర్, పెయింటింగ్, పెద్ద చిన్నతరహా మరమ్మతులు, ఆకుపచ్చ రాతబోర్డులు, ప్రహరీ, వంట గది, శిథిల భవనాల స్థానంలో నూతన గదుల నిర్మాణం, భోజనశాల, డిజిటల్ తరగతుల సౌకర్యాలు ఇలా 12 రకాల పనులు చేయాల్సి ఉంటుంది. జిల్లాలో తొలి విడతగా 172 పాఠశాలలను ఎంపిక చేశారు. మరమ్మతులు, రూ.30 లక్షల పైన ఉన్న పనులను టెండర్ల ద్వారా అప్పగించారు. అంతకంటే తక్కువ విలువ కలిగిన పనులు ఎస్ఎంసీల తీర్మానంతో ఎక్కడికక్కడే అప్పగించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమం కావడంతో పనులు పూర్తవగానే బిల్లులు మంజూరవుతాయని గుత్తేదారులు భావించినా వారికి నిరాశే ఎదురవుతోంది.

**వాళ్లు చెప్పినవారికే డబ్బులు**

రాష్ట్ర ఖజానా శాఖ (ఎస్టీవో)లో చేయి తడపనిదే బిల్లులు మంజూరయ్యే పరిస్థితి లేదని జిల్లాలో ఓ గుత్తేదారు వాపోయారు. 'తన తరువాత పనులు చేసిన వారి బిల్లులు మంజూరవుతున్నా తనకు ఎందుకు ఇవ్వలేదని సదరు కార్యాలయ అధికారులను ప్రశ్నిస్తే.. రాష్ట్ర స్థాయి అధికారులు చెప్పినవారికే ఇస్తామని.. తమ చేతుల్లో ఏం లేదని ఖరాఖండీగా చెప్పేశార'ని ఆవేదన చెందారు. పైరవీలు చేసేవారికి, అడిగినంత ముడుపులు సమర్పించుకుంటున్నవారికి బిల్లులు క్లియర్ అవుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసి విసిగిపోయామని, చేసిన పనులకు డబ్బులు ఇప్పటికైనా మంజూరు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

**90 శాతం పూర్తయ్యాయని చెబుతున్నా..**

ఒక ఇంజినీరింగ్ శాఖకు పనులు అప్పగిస్తే ఆలస్యమవుతుందని భావించి, మండలాల వారీగా రహదారులు, భవనాలు, పంచాయతీరాజ్, నీటిపారుదల, విద్యాశాఖ ఇంజినీరింగ్ విభాగాలకు అప్పగించారు. వీటి లెక్కల ప్రకారం జిల్లాలోని తొలివిడత పాఠశాలల్లో పనులు 90 శాతం పూర్తయి, 10 శాతం పనులు పురోగతిలో ఉన్నాయని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. చాలామటుకు గుత్తేదారులకు చేసినవాటికే బిల్లులు రాకపోవడంతో మధ్యలోనే వదిలేశారు. గతేడాది నవంబరులో మంత్రి కేటీఆర్ సమీక్షలో 2023 జనవరి 15లోపు పనులు పూర్తి చేసి రెండో విడత పాఠశాలలను ఎంపిక చేయాలని సూచించారు. పనుల ప్రగతిపై కలెక్టర్ ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తున్నా ఆశించిన ఫలితాలు కనిపించడం లేదు. తొలి దశ పనులే ఇప్పటి వరకు పూర్తి కాలేదని, రెండు, మూడో దశ పనులు ఎప్పుడవుతాయో అర్థం కాని పరిస్థితులున్నాయి.

వేములవాడ నియోజకవర్గంలో 'మన ఊరు– మన బడి'లో భాగంగా ఓ గుత్తేదారు రూ.2 కోట్ల విలువైన పనులు దక్కించుకున్నారు. ఇప్పటికీ సుమారు రూ.కోటి మేర పనులు పూర్తి చేయగా బిల్లులు ఇంజినీరింగ్ విభాగం పరిశీలనానంతరం రాష్ట్ర ఖజానా శాఖ కార్యాలయం (ఎస్టీవో)కు చేరాయి. కానీ అయిదు నెలలుగా మిగతా పనులు చేద్దామన్నా కనీసం రూ.పది లక్షలు కూడా మంజూరు కాకపోవడంతో బడుల్లో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

కోనరావుపేట మండలం వట్టెంల–గొల్లపల్లి సర్పంచి పరశురాం ఆ ఊరి పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని రూ.22 లక్షలతో చేపట్టారు. నిర్మాణం చివరి దశలో ఉంది. బిల్లులు విడుదల కాకపోవడంతో ఇరవై రోజుల క్రితం కలెక్టర్‌ను కలిసి గోడు వెళ్లబోసుకున్నాడు. పరిశీలించి త్వరలోనే మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటికీ నిధులు జమకాలేదు. నిధులు వస్తే పనులు పూర్తిచేయాలని చూస్తున్నారు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం**

పనులు వేగంగా పూర్తయ్యేలా ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తున్నాం. బిల్లుల అంశం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటాం. నిధుల మంజూరులో కొంత జాప్యం జరుగుతున్నా ఆ ప్రభావం పనులపై పడకుండా జాగ్రత్తలు చేపడుతున్నాం. వీలైనంత త్వరగా మొదటి విడత పూర్తి చేసి రెండో విడత పాఠశాలలు ఎంపిక చేస్తాం. రమేశ్‌కుమార్, జిల్లా విద్యాధికారి

# కలిసి వచ్చిన కాలం.. ఉబికి వచ్చిన జలం

జగిత్యాల : వానాకాలం సీజను ముగింపునకు వస్తున్నా జిల్లాలోని చాలా మండలాల్లో భూగర్భ జలమట్టం కనిష్ఠస్థితిలోనే ఉంది. కురవాల్సిన వర్షం కన్నా 29.4 శాతం అధికవర్షం కురియగా ఆయకట్టుకు శ్రీరామసాగర్ ప్రాజెక్టునీరు రావటం, చెరువులన్నీ అలుగు పారటంతో భూగర్భ జలమట్టం మరింతగా పైకివచ్చింది. ప్రస్తుతం జగిత్యాల రూరల్ మండలంలో అతితక్కువ లోతులో, కొడిమ్యాల మండలంలో ఎక్కువ లోతులో నీళ్లున్నాయి. నీటి లభ్యతతో జిల్లాలో ఈ వానాకాలంలో అధికారుల అంచనాను దాటి 107.55 శాతం విస్తీర్ణంలో 4.43 లక్షల ఎకరాల్లో అన్ని రకాల పంటలను సాగుచేశారు. వరిసాగు 3.06



లక్షల ఎకరాలను దాటి రాష్ట్రంలోనే అయిదోస్థానంలో నిలిచింది. పసుపుసాగులో జిల్లా రాష్ట్రంలో రెండోస్థానంలో ఉంది. ఈ సీజన్‌లో తొలుత వర్షాలు ఇబ్బంది పెట్టినా ప్రస్తుతం వర్షాలు కురియటం, భూగర్భ జలమట్టం కనిష్ఠ స్థాయిలోనే ఉండటంతో పంటలను ఇబ్బంది లేకుండా పూర్తిచేసే అవకాశం రైతులకు కలిగింది. మొక్కజొన్న, పెసర, సోయా తదితర పంటలు పూర్తవుతుండగా వరి నూర్పిడి ప్రారంభం కానుంది. జిల్లాలో అందుబాటులోని భూగర్భ జలాలతో బావులు, బోర్ల ఆధారితం, ఆయకట్టులో ఎస్సారెస్పీ నీరు యాసంగి సాగుకు దోహదపడుతుందని భూగర్భ జలవనరుల శాఖ జిల్లా అధికారి నర్సింహులు పేర్కొన్నారు.

జిల్లాలో సాధారణ వర్షపాతం 835.8 మి.మీలు

ఇప్పటివరకు కురిసినది 1081.7 మి.మీలు

ఆగస్టు నెలాఖరున జిల్లా సగటు జలమట్టం: 2.48 మీటర్లు

సెప్టెంబరు నెలాఖరున జిల్లా సగటు జలమట్టం: 2.09 మీటర్లు

# పసిగడతాయ్.. పనిపడతాయ్!



కొత్తగూడెం : ఖమ్మం గ్రామీణ మండలం తల్లంపాడులో సంచలనం సృష్టించిన తమ్మినేని కృష్ణయ్య హత్య కేసు పరిష్కారానికి 'రీటా' దోహదపడింది. సత్తుపల్లి మండలం నారాయణపురంలో తల్లీకొడుకుల హత్య కేసునూ ఛేదించింది. వీఐపీల పర్యటనల సందర్భంగా, అనుమానితుల నుంచి పేలుడు, మత్తు పదార్థాలు గుర్తించడంలో జాగిలాలు కీలకంగా వ్యవహరిస్తున్నాయి. కుక్క బతుకేనా అని తేలిగ్గా తీసిపారేయకండి.. అన్ని శునకాలు ఒకేమాదిరి కాదని.. కొన్నింటి జీవన విధానాన్ని చూస్తే ఇట్టే తెలిసిపోతుంది. భోజనం, శిక్షణ, సంరక్షణ, ఉద్యోగ విరమణ ఇలా ప్రతి అంశాల్లో జాగిలాలు ప్రత్యేకత చాటుతున్నాయి. నేర పరిశోధనలో పోలీసు శాఖకు విశిష్ట సేవలందిస్తూ ప్రశంసలు అందుకుంటున్నాయి. ఉభయ జిల్లాలో సేవలందిస్తున్న పోలీసు జాగిలాలపై ప్రత్యేక కథనం.

నేరం జరిగిన ప్రదేశంలో సాక్ష్యాలను కనిపెట్టడం, పోలీసులు లక్ష్యంగా చేసుకున్న వ్యక్తులపై ఎగబడటం జాగిలాలు చేసేపని. ఇందుకోసం వాటికి కఠిన శిక్షణ ఇస్తారు. ముందుగా రెండు, మూడు నెలల వయస్సు కలిగిన కుక్కపిల్లలను ఎంపిక చేస్తారు. హైదరాబాద్‌లోని మొయినాబాద్ శిక్షణ కేంద్రంలో వాటికి తర్ఫీదునిస్తారు. ప్రాథమిక శిక్షణ అనంతరం పోలీసు విభాగంలోని ఇంటిలిజెన్స్, గ్రేహౌండ్స్ డిపార్ట్‌మెంట్లు తమకు ఉపయోగపడేలా వాటిని మార్చుకుంటారు.

ఖమ్మం జిల్లాలో..శిక్షణ పొందిన ఏడు జాగిలాలు సేవలందిస్తున్నాయి. ట్రాకర్ విభాగంలో రెండు, నార్కోటిక్ విభాగంలో ఒకటి, ఎక్స్‌ప్లోజివ్ విభాగంలో నాలుగు ఉన్నాయి. మరొకటి ఎక్స్‌ప్లోజివ్ విభాగంలో శిక్షణ పొందుతోంది. వీటికి జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో సకల సౌకర్యాలు కల్పించారు. ఎనిమిది మంది సిబ్బంది వీటికి నిత్యం శిక్షణ ఇస్తున్నారు. ట్రాకర్‌గా రీటా, నిక్కీబీ ఎక్స్‌ప్లోజివ్‌గా జంబో, రోని, సోని, యామిబీ నార్కోటిక్‌గా స్కూబీ సేవలందిస్తున్నాయి. పూనమ్ శిక్షణలో ఉంది.

భద్రాద్రి జిల్లాలో..శిక్షణ పొందిన పది జాగిలాలు సేవలందిస్తున్నాయి. ట్రాకర్ విభాగంలో షేర్, గ్లోడిబీ నార్కోటిక్ విభాగంలో రీనా, గ్రేసీబీ ఎక్స్‌ప్లోజివ్ విభాగంలో లూసీ, స్లెఫీ, షైనీ, స్నూపీ, జూనో, బిన్నీ ఉన్నాయి.

**ఎప్పుడు మొదలైంది?**

నేర పరిశోధనలో జాగిలాల వాడకం 14వ శతాబ్దంలో ప్రారంభమైంది. గ్రామాల్లో జరిగే నేరాలను ఛేదించటంలో పారిస్ పోలీసులు తొలుత వీటిని ఉపయోగించారు. స్కాట్లాండ్ దేశస్థులు 'స్లో డాగ్స్' అని పిలిచే శునకాలను ఉపయోగించేవారు. 19వ శతాబ్దంలో లండన్‌లో వేగంగా పట్టణీకరణ జరుగుతున్న సమయంలో నేరాల సంఖ్య అధికంగా ఉండేది. నేరస్థుల నుంచి ప్రజలు తమను తాము రక్షించుకునేందుకు తుపాకీలు, శునకాలను ప్రభుత్వం వారికి అందించింది. 1889లో లండన్ మెట్రోపాలిటన్ పోలీసు కమిషనర్ సర్ చార్లెస్ వారెన్ పోలీసు సేవల్లో జాగిలాలను ప్రవేశపెట్టారు.

**ప్రసిద్ధ జాతులు..**పోలీసు జాగిలాలుగా వివిధ జాతుల కుక్కలు ఉపయోగపడుతున్నాయి. వీటిలో జర్మన్ షెఫర్డ్, లాబ్రడార్, టెర్రియర్, అకిటా, గ్రోనెండెల్, స్లీత్, బాక్సర్, డాబర్‌మాన్ వంటివి ప్రధానమైనవి.

**ఒక్కోపనికి ఒక్కోరకం**

దొంగతనాలు, హత్యలు జరిగినప్పుడు ట్రాకర్‌బీ వీఐపీల పర్యటన, దాడి చేస్తామంటూ(థ్రెట్) కాల్స్ వచ్చినప్పుడు బాంబులను గుర్తించేందుకు ఎక్స్‌ప్లోజివ్‌బీ గంజాయి, కొకైన్, ఇతర మాదకద్రవ్యాలను పట్టుకునేందుకు నార్కోటిక్ శిక్షణ పొందిన శునకాలను ఉపయోగిస్తారు. నేర పరిశోధనలో కొన్ని జాగిలాలు విశేషమైన ప్రతిభ కనబరుస్తున్నాయి. వీటిని సానబెట్టేందుకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఏటా పోటీలు నిర్వహిస్తుంటారు. ఖమ్మం జిల్లాకు చెందిన రీటా అనే జాగిలం 2016లో మైసూర్‌లో జరిగిన పోటీలో జాతీయ స్థాయిలో బెస్ట్ డాగ్ రోలింగ్ ట్రోఫీతో పాటు బంగారు పతకాన్ని గెలుచుకుంది.

**భళా.. శిక్షణ**

కూర్చోమనటం, నిల్చోమనటం, సెల్యూట్ చేయటం, నేరస్థులను పట్టుకునేలా వేగంగా పరుగెత్తించటం, హార్డిల్స్ పైనుంచి దూకించటం వంటివి తొలి రెండు, మూడు నెలలు నేర్పిస్తారు. తొలుత స్థానిక భాషలో వాటికి ఆదేశాలివ్వడం మొదలుపెడతారు. మెడపై నిమురుతూ హ్యాండ్లర్ (జాగిలాలకు శిక్షణ ఇచ్చే సిబ్బంది) ఆదేశాలను పాటించేలా చేస్తారు. అనుమానితుడిని పట్టుకునే విషయంలో ఎంత బలాన్ని ఉపయోగించాలనే దానిపై శిక్షణ ఇస్తారు. మత్తు పదార్థాలు పసిగట్టడం, పేలుడు పదార్థాల గుర్తింపునకు అంశాల వారీగా తర్ఫీదు ఇస్తారు. బాంబ్ ఎక్స్‌ప్లోజివ్‌ల్లో ఉపయోగించే పౌడర్ల నమూనాలను వాటికి పరిచయం చేస్తారు. సువాసనలు, మాంసంలో రక్తం కలిపి వాటి వాసన చూపిస్తారు. ఆ వాసనకు అలవాటైన శునకాలు ఆపదార్థాలు ఎక్కడ దాచినా పసిగట్టేస్తాయి. మాక్‌డ్రిల్స్ ద్వారా వాటికి ప్రాక్టికల్ అనుభవాన్ని అందిస్తారు. పోలీసు జాగిలాల మెనూ ప్రత్యేకంగా ఉంటుంది.

**ఘనంగా వీడ్కోలు..**పోలీసు శాఖలో శిక్షణ పొందిన జాగిలాలు ఆరు నుంచి తొమ్మిదేళ్లు విధులు నిర్వర్తిస్తున్నాయి. ఏదైనా ఘటనలో గాయపడితే కోలుకునే వరకు వాటికి పోలీసులు విశ్రాంతినిస్తారు. గాయం పెద్దదైతే విధుల నుంచి తప్పిస్తారు. వయస్సు మీరినా, అనారోగ్యం బారిన పడినా ఘనంగా వీడ్కోలు పలుకుతారు. జాగిలాలు మరణిస్తే అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తారు.

పోలీసు శాఖకు జాగిలాలు విశేష సేవలందిస్తున్నాయి. నేరాల పరిశోధనతోపాటు మాదక ద్రవ్యాలు, పేలుడు పదార్థాలను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరిస్తున్నాయి. సేవలందిస్తున్న జాగిలాల ఆహారం, వైద్యంపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. విష్ణు ఎస్.వారియర్, పోలీసు కమిషనర్, ఖమ్మం

# అన్నం పెట్టే బ్యాంకుకే కన్నం




ఖమ్మం : ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో స్వాహాల పర్వం కొనసాగుతోంది. తాజాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలంలోని లక్ష్మీనగరం శాఖలో మరో కుంభకోణం వెలుగు చూసింది. ఇప్పటికే అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి శాఖల్లో అక్రమాలకు పాల్పడి పెద్ద ఎత్తున నిధులు స్వాహా చేసిన విషయంలో ఇద్దరు బ్రాంచి మేనేజర్లను డీసీసీబీ ఉన్నతాధికారులు సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. టేకులపల్లి, మర్లపాడు బ్రాంచిల్లో సైతం నిధుల స్వాహాకు సంబంధించి విచారణ జరుగుతోంది. ఈ రెండు బ్రాంచిల్లో మేనేజర్ల పాత్రపై అధికారులు విచారణ చేస్తున్నారు. లక్ష్మీనగరం బ్రాంచిలో ప్రధానంగా ఇద్దరు ఉద్యోగుల పాత్ర ఉన్నట్లు ఇప్పటి వరకు గుర్తించారు. బ్రాంచి మేనేజర్ పాత్రపైనా ఆరా తీస్తున్నారు. నెల వ్యవధిలో ఐదు బ్రాంచిల్లో అక్రమాలు వెలుగుచూడటం ఇదే మొదటిసారి. ఇలా ఇంకా ఎక్కడెక్కడ ఉన్నాయనే విషయాలపై ఇప్పుడు డీసీసీబీ ప్రధానంగా దృష్టి పెట్టింది.డీసీసీబీకి నాలుగు జిల్లాల పరిధిలో పరిధిలో 50 శాఖలున్నాయి. వీటిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీ పరిధిలోని ఐదు శాఖల్లో అక్రమాలు వెలుగుచూశాయి. మేనేజర్లపైన నోడల్ అధికారులుగా ఏజీఎంలు, డీజీఎంలు, జీఎంలు, సీఈఓతో పాటు పాలకవర్గం నుంచి ఛైర్మన్ ఉన్నారు. ఇంత పటిష్ఠమైన వ్యవస్థ ఉన్నప్పటికీ అధికారులు, సిబ్బంది కలిసి రైతుల సొమ్మును కాజేస్తున్నారు.

**విచారణ అధికారిగా ఏజీఎం కృష్ణమోహన్**

లక్ష్మీనగర్ బ్రాంచిలో బ్యాంకు ఉద్యోగులు అక్రమాలకు పాల్పడిన విషయం తెలిసిన వెంటనే డీసీసీబీ ఛైర్మన్ కూరాకుల నాగభూషయ్య, సీఈఓ అట్లూరి వీరబాబు ఏజీఎం కృష్ణమోహన్‌ను విచారణ అధికారిగా నియమించారు. ప్రస్తుతం ఆయన ఇదే బ్రాంచికి నోడల్ ఆఫీసర్‌గా ఉన్నారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపిన అనంతరం నివేదిక అందజేయాలని ఆదేశించారు.

**అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని...**

మారుమూల ప్రాంతాల్లో నిరక్షరాస్యులైన గిరిజనులను ఆసరా చేసుకుని బ్యాంకు సిబ్బంది దారుణంగా మోసం చేశారు. రుణమాఫీ నిధులతో పాటు పలు ఇతర రకాల అక్రమాలకు పాల్పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఒక్కో రైతు నుంచి రూ.1,000 నుంచి రూ.2,000 వరకు వసూలు చేసినట్లు చెబుతున్నప్పటికీ రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు వసూలు చేసినట్లు సమాచారం. ఇలా పెద్ద మొత్తంలో రూ.లక్షల దండుకున్నట్లు తెలుస్తోంది. వసూలు చేసిన డబ్బును అధికారులు వాటాలు పంచుకోగా, కిందిస్థాయి సిబ్బందికి ఇవ్వకపోవటంతో విషయం బయటపడినట్లు సమాచారం.

# కళతప్పిన పర్యాటకం.. వెంటాడుతున్న నిర్లక్ష్యం

కొత్తగూడెం : ప్రకృతి అందాలకు నెలవైన కిన్నెరసాని పర్యాటక ప్రాంతం కళ తప్పుతోంది. పర్యాటకులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలనే ఉద్దేశంతో మొదలుపెట్టిన అభివృద్ధి పనులు పూర్తికాకపోవడంతో ఇక్కడికి వచ్చేవారి సంఖ్య క్రమేణా తగ్గుతోంది.నత్తనడకన పనులు..రాష్ట్రంలో ప్రసిద్ధి గాంచిన పర్యాటక ప్రదేశాల్లో ఒకటైన కిన్నెరసాని ప్రాంతం, ప్రకృతి అందాలను ఆస్వాదించటానికి నిత్యం వందలాది మంది యాత్రికులు వస్తుంటారు. ఆహ్లాదకరమైన వాతావరణం, దుప్పులు, నెమళ్లు పర్యాటకులను ఆకట్టుకుంటాయి. రిజర్వాయర్‌లో బోటు షికారు మరింత ఆకర్షిస్తుంది. దీన్ని గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రాంతాన్ని పర్యాటక హబ్‌గా మారుస్తామని ప్రకటించాయి. అందుకు అనుగుణంగా 2015లో కేంద్ర ప్రభుత్వం రూ.3.24 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.7.53 కోట్లు కేటాయించాయి. 2016లో పనులు మొదలయ్యాయి. 2017 ఆఖరు వరకు పనులు పూర్తిచేయాలని గుత్తేదారుతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. గుత్తేదారు నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా పనులు నత్తనడకన సాగుతున్నాయి.పర్యవేక్షణ మారినా అదే దుస్థితి కిన్నెరసాని పర్యాటక ప్రాంత అభివృద్ధిలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన నిధులతో కొత్తగూడెంలో టూరిజం హోటల్, కిన్నెరసానిలో అద్దాలమేడ, తొమ్మిది కాటేజీలు, ఫుడ్ కోర్టు నిర్మించాలని నిర్ణయించారు. నిర్మాణ పనులను హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రముఖ కంపెనీకి అప్పగించి పర్యవేక్షణ బాధ్యతలను పంచాయతీరాజ్ శాఖకు కేటాయించారు. కాటేజీలు, రెండంతస్తుల అద్దాలమేడ నిర్మాణం నత్తను తలపిస్తోంది. కూలీల సమస్య ఎదురవుతోందని పర్యాటక హోటల్, ఫుడ్ కోర్టు పనులను గుత్తేదారు అర్థాంతరంగా ఆపేశారు. పంచాయతీరాజ్‌శాఖ సదరు కంపెనీకి నోటీసులు జారీ చేసింది. గుత్తేదారు గడువు పొడిగించాలని కోరడంతో 2018 వరకు అధికారులు అవకాశమిచ్చారు. అయినప్పటికీ కేవలం 70 శాతం పనులు మాత్రమే పూర్తి చేసి గుత్తేదారు జారుకున్నారు. అనంతరం 2020లో పర్యవేక్షణ బాధ్యతలను పంచాయతీరాజ్ శాఖ నుంచి పర్యాటక శాఖ తీసుకుంది. పర్యాటక శాఖ పర్యవేక్షణ చేపట్టి మూడేళ్లు దాటినా పనులు నెమ్మదిగానే సాగుతున్నాయి.కిన్నెరసాని పర్యాటక ప్రాంత అభివృద్ధి పనులకు అటవీశాఖ అనుమతులు సకాలంలో రాలేదు.

# పస్తులతోనే చదువులు

పెద్దపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సమ్మెతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. బడి ఆవరణలో పొయ్యి వెలగకపోవడంతో కొందరు పిల్లలు భోజనాన్ని ఇంటి నుంచి తెచ్చుకుంటుండగా మరికొందరు ఉదయాన్నే వంట తయారు కాక పస్తులుంటున్నారు. కార్మికులు ముందస్తుగా సమ్మె నోటీసు ఇచ్చినప్పటికీ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలమయ్యారు. కొన్ని చోట్ల ప్రధానోపాధ్యాయులు చొరవ చూపుతున్నా వంట పాత్రలు లేక సాధ్యం కావడం లేదు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పలు పాఠశాలల్లో విద్యార్థుల అవస్థలపై 'న్యూస్‌టుడే' పరిశీలించింది."

**రాగిజావ పంపిణీతో సత్ఫలితం**

జిల్లాలోని 539 ప్రభుత్వ పాఠశాలల్లో 31 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో ప్రతి రోజూ సగటున 25 వేల మంది మధ్యాహ్న భోజనం తింటున్నారు. ఇటీవల ఉదయం వేళ రాగిజావ పంపిణీ ప్రారంభించడంతో విద్యార్థుల హాజరు శాతం పెరుగుతోంది. మధ్యాహ్న భోజన పథకం కింద జిల్లావ్యాప్తంగా 981 మంది 21 ఏళ్లుగా పని చేస్తున్నారు. పెంచిన వేతనాల అమలు, పెండింగ్ బిల్లుల మంజూరు తదితర డిమాండ్లతో సమ్మె కొనసాగిస్తున్నారు.

**భావిపౌరులకు తప్పని పస్తులు**

ఓదెల మండలంలోని పలు పాఠశాలల్లో పరిశీలించగా కొందరు విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం తిన్నారు. మరికొందరు పస్తులున్నారు. ఇంకొందరు సమీపంలోని ఇళ్లకు వెళ్లారు. మండలంలో 22 ప్రాథమిక, 9 ప్రాథమికోన్నత, 5 ఉన్నత, 1 ఆదర్శ పాఠశాలలున్నాయి. 11 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిలిచిపోయింది.

**తాత్కాలిక ఉపశమనం**

మంథని గ్రామీణం: మండలంలోని 59 పాఠశాలలుండగా రెండు రోజులుగా కొన్ని చోట్ల మధ్యాహ్న భోజనాన్ని నిర్వాహకులు వండి పెట్టారు. మరికొన్ని చోట్ల విద్యార్థులు ఇంటి నుంచే తెచ్చుకున్నారు. పట్టణంలోని బాలుర పాఠశాల ఉపాధ్యాయులు శుక్రవారం ఓ వంట మనిషిని మాట్లాడి వంటలు చేయించారు. ఎక్లాస్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో ఒక్క రోజు నిర్వాహకులు వండినా శనివారం నుంచి మళ్లీ సమ్మెకు వెళ్లారు.

**త్వరలోనే నిధులు విడుదలవుతాయి**

మధ్యాహ్న భోజనం తయారీకి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాం. కొన్ని చోట్ల వంట చేస్తున్నారు. పెండింగ్ బిల్లుల మంజూరుకు ప్రతిపాదించాం. త్వరలోనే విడుదల కానున్నందున వంట చేయాలని నిర్వాహకులను ఆదేశించాం.మాధవి, జిల్లా విద్యాధికారి

చేతిలో టిఫిన్ డబ్బాలు పట్టుకొని వస్తున్న వీరంతా పెద్దపల్లిలోని శాంతినగర్ పాఠశాల విద్యార్థులు. ఇక్కడ వంద మందికి పైగా చదువుకుంటున్నారు. కొందరు విద్యార్థులు భోజనం చేసేందుకు ఇంటికి వెళ్తుండగా, మరికొందరు వెంట డబ్బాల్లో తెచ్చుకుంటున్నారు.పెద్దపల్లి మండలం అప్పన్నపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనాన్ని ఆరుబయట కూర్చుని తింటున్నారు. ఈ బడిలో సమీప గ్రామాల విద్యార్థులు కూడా చదువుకుంటున్నారు. దూర ప్రాంతం నుంచి వస్తుండటంతో ఉదయం వంట తయారు కాక పస్తులుండాల్సి వస్తోంది.

**హోటల్‌లో అల్పాహారం**

మండలకేంద్రంలో కొందరు విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకుంటున్నారు. మరికొందరు సమీపంలోని హోటల్‌కు వెళ్లి అల్పాహారం చేస్తున్నారు. వసతిగృహాల్లో ఉండే విద్యార్థులు మధ్యాహ్నం వెళ్లి భోజనం చేసి వస్తున్నారు. పట్టణంలోని ఆంగ్లమాధ్యమ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం 76 మంది విద్యార్థులకు 72 మంది హాజరు కాగా ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనాన్ని తిన్నారు.

**తగ్గుతున్న హాజరు శాతం**కమాన్‌పూర్ మండలం గుండారం పరిధి రాజాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకుంటున్నారు. ఈ బడిలో మొత్తం 45 మంది విద్యార్థులకు శుక్రవారం 43 మంది హాజరయ్యారు. భోజనం తెచ్చుకోని విద్యార్థులు ఇంటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో హాజరుశాతం తగ్గుతోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

**ఆరు చోట్ల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు**

మండలంలోని 51 ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 2,600 మంది విద్యార్థులకు గాను నిత్యం దాదాపు 2200 మంది భోజనం చేస్తున్నారు. శుక్రవారం ధర్మారంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనాన్ని తిన్నారు. సమీపంలోని వారు ఇళ్లకు వెళ్లి వచ్చారు. బొట్లవనపర్తి, పెరుకపల్లి, బంజరుపల్లి, కొత్తూరు, నాయకంపల్లి, కళ్లెంరెడ్డిపల్లి పాఠశాలల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. మిగతా చోట్ల పొయ్యి వెలగడం లేదు.

# ఆమోదం లేదు.. చెల్లింపులు పూర్తయ్యాయి!

జగిత్యాల : పురపాలికలో ప్రతిపైసాకు పక్కాగా లెక్క చెప్పి కౌన్సిల్ ఆమోదం తీసుకోవాల్సి ఉంటుంది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల పేరిట జగిత్యాల పురపాలక సంఘం రూ.5.99 లక్షలు ఖర్చు చేసింది. అవసరం లేకపోయినా సాధారణ నిధులను నిబంధనలకు విరుద్ధంగా వెచ్చించారు. రూ.లక్షపైన చేపట్టే పనులకు ఆన్‌లైన్ ద్వారా టెండర్లు నిర్వహిస్తారు. రూ.లక్షలోపు పనిని స్థానికంగా కొటేషన్లు తీసుకున్న తరువాత కౌన్సిల్ ఆమోదం మేరకు బిల్లులు చెల్లించాలి. బల్దియాలో అంతా ఇన్‌ఛార్జులే కావడంతో అడ్డగోలు బిల్లులు చూపి అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇంటి పన్నుల రూపంలో ప్రజలు చెల్లించిన ప్రజాధనం పక్కదారి పట్టడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**మొరం పేరిట రూ.లక్షలు స్వాహా..**

గత నెలలో వినాయక చవితి నుంచి దసరా వరకు కాలనీల్లో, రహదారుల్లో డస్ట్, మొరం నింపేందుకు రూ.25 లక్షలు కేటాయించారు. పనులు సైతం కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఇటీవల పురపాలక శాఖ మంత్రి జగిత్యాలలో పర్యటించినప్పుడు గుంతలు నింపేందుకు మళ్లీ రూ.3 లక్షలు కేటాయించి అత్యవసరం పేరిట నిధులు స్వాహా చేశారు. వాస్తవంగా దసరా వరకు మొరం నింపాల్సిన బాధ్యత పాత గుత్తేదారులకే ఉంటుంది. ఇక కేసీఆర్ పర్యటన కోసం రూ.3,06,200 ఫ్లెక్సీల ఖర్చు చూపారు. కానీ ఇందులో చాలావరకు ప్రజాప్రతినిధుల ఫ్లెక్సీలే అధికంగా ఉన్నాయి. వీటిని బల్దియా ఖర్చులో చూపడం గమనార్హం. పారిశుద్ధ్య కార్మికుల కోసం 4 రోజులపాటు భోజనాలకు రూ.1.74 లక్షలు ఖర్చు చేసినట్లు చెబుతున్నారు. రోజుకు 200 కార్మికులు భోజనం చేసినా రూ.లక్ష దాటదనే విషయం పాలకులు గ్రహించలేదు. పైగా కార్మికులందరికీ బల్దియా తరఫున వంటలు చేసి ఏకంగా రూ.1.74 లక్షలకు బిల్లు పెట్టారు. బల్దియాలో కుర్చీలున్నా బయట నుంచి తెచ్చినట్లు చూపడం గమనార్హం.

**అక్రమాలివిగో..**దశాబ్ది ఉత్సవాల పేరిట బల్దియాలో అక్రమాలకు తెరలేపారు. అమరుల స్థూపం కోసం రూ.6800, స్టేషనరీ రూ.96, 987, ఊరూరా చెరువుల పండుగ భోజనాల కోసం రూ.80,360, అంబలికి రూ.10,200, కార్యక్రమంలో కుర్చీలు వేసినందుకు రూ.29,700, దశాబ్ది ఉత్సవాల బ్రోచర్లు రూ.18,816, పట్టణ ప్రగతిలో భోజనం ఖర్చు రూ.1.32 లక్షలు ఇలా మొత్తం రూ.6 లక్షల మేరకు బిల్లులు సృష్టించి నిధులు డ్రా చేసుకున్నారు. వీటిని ఈ నెల 9న నిర్వహించనున్న బల్దియా సమావేశంలో అజెండాకు తేనున్నారు. నిబంధనల ప్రకారం ముందు అజెండాకు తెచ్చి కౌన్సిల్ ఆమోదం మేరకు బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. కానీ పాత కమిషనర్ హయాంలో చెక్కులు రాసి వ్యూహం ప్రకారం చెల్లింపులు చేశారు. ఈ ఖర్చులన్నీ సంబంధిత ప్రజాప్రతినిధులకు సంబంధించిన కంపెనీల పేరిట కొటేషన్లు తీసుకోవడం గమనార్హం.కలెక్టర్ ఆమోదం మేరకే పనులు– అనిల్‌బాబు, కమిషనర్కేటీఆర్ పర్యటనకు సంబంధించిన పనులు కలెక్టర్ ఆదేశాల మేరకు చేపట్టాం.

# టెక్స్‌టైల్ పార్క్ భూసేకరణపై రైతుల ఆందోళన

కొడకండ్ల : కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు భూసేకరణపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తొలుత పార్క్ ఏర్పాటుకు ప్రధాన రహదారి పక్కనున్న 9.22 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారు. రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి సంస్థ అధికారులు కనీసం 50 ఎకరాల స్థలం కావాలని కోరడంతో రెవెన్యూ అధికారులు స్థల సేకరణకు చర్యలు చేపట్టారు. కొడకండ్లకు దూరంగా మరో ప్రదేశంలో ప్రభుత్వ స్థలం ఉన్నప్పటికీ ఆ ప్రదేశంలో గుట్టలు ఉండటంతో అక్కరకు రాదని తిరస్కరించారు. దీంతో రెవెన్యూ అధికారులు మొదట గుర్తించిన 9.22 ఎకరాలకు తోడుగా దాని పక్కనున్న 20 ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూమిని సేకరించి పార్క్‌కు కేటాయించాలని ప్రతిపాదించారు. కొన్ని దశాబ్దాల క్రితం తమకు ప్రభుత్వం అందించిన 20 ఎకరాల భూములను అప్పగించే ప్రసక్తి లేదంటూ రైతులు తహసీల్దార్, కలెక్టర్‌లకు వినతిపత్రాలు అందజేశారు. ఆ భూమిలో సుమారు 2 ఎకరాల్లో మాత్రమే పట్టా భూములున్నాయని అధికారులు తెలిపారు. అసైన్డ్ భూములపైనే తమ జీవితాలు ఆధారపడి ఉన్నాయంటూ సుమారు వంద మంది రైతులు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. దీంతో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు



స్థల సేకరణ వివాదాస్పదం కానుంది.

**భూములను అప్పగించే ప్రసక్తి లేదు**

–గుండా పూర్ణచందర్, కొడకండ్ల

టెక్స్‌టైల్‌పార్కును ఏర్పాటు చేయడం హర్షణీయమైనప్పటికీ, మా జీవనాధారమైన సొంత వ్యవసాయ భూములను తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నాం. కొడకండ్లలో వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. మా జీవనాధారమైన భూములను అప్పగించే ప్రసక్తి లేదు.

**న్యాయ పోరాటానికైనా సిద్ధం**

–కాగితం ఉప్పలయ్య, రైతు

మా తాతల కాలంలో ప్రభుత్వం అందించిన భూములనే ఆధారంగా చేసుకొని జీవనం సాగిస్తున్నాం. అప్పుడు ఇచ్చిన భూములను తిరిగి తీసుకుంటామనడం సమంజసం కాదు. అధికారులందరినీ వేడుకుంటున్నాం. చివరికి న్యాయ పోరాటానికైనా సిద్ధం. మా భూములను అప్పగించబోం.

# నిర్వహణలో నిర్లక్ష్యం

కరీంనగర్ :అందరికీ వ్యాయామం అందించేందుకు ఓపెన్‌జిమ్‌లు.. ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు పార్కులు.. నడక కోసం వాకింగ్‌ట్రాక్‌లు నిర్మించేందుకు నగర పాలక సంస్థ ముందుకొచ్చి నిధులు కేటాయిస్తోంది. వీటి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తుండటంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. ఎప్పటికప్పుడూ పర్యవేక్షణ పెంచితే కొన్నాళ్లపాటు చెక్కు చెదరకుండా ఉంటాయి. నగరంలో బహిరంగ వ్యాయామశాలల పరిస్థితిపై కథనం. కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా పలు డివిజన్లలో బహిరంగ వ్యాయామశాలలు(ఓపెన్‌జిమ్‌లు) ఏర్పాటు చేశారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ఆయా ప్రాంతవాసులు నడకకు వచ్చే ప్రాంతాల్లో, పార్కు స్థలాలు, డివిజన్లలో ఖాళీగా ఉన్న స్థలాల్లో వీటిని బిగించారు. నిత్యం వందల సంఖ్యలో నగరవాసులు వ్యాయామం చేస్తున్నారు. ప్రజల నుంచి వస్తున్న వినతుల మేరకు 60 డివిజన్లలో ఏర్పాటు చేయాలని నిర్ణయించినా.. సాధ్యం కాకపోవడంతో మొదటి దశలో పలు చోట్ల ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చారు.

**టైల్స్‌కు బదులుగా షీట్లు**

గతంలో గచ్చు వేసి టైల్స్ వేసిన చోట ఓపెన్‌జిమ్‌లు ఏర్పాటు చేయగా



ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉన్నాయి. కొత్తగా ఒక్కో జిమ్‌కు రూ.12 లక్షలు వెచ్చించి 10 వ్యాయామ పరికరాలు, ఫ్లోరింగ్‌లో రబ్బర్ షీట్లు వేస్తున్నారు. వర్షం పడినప్పుడు, వ్యాయామం చేసే సమయంలో నడిచే క్రమంలో తగులుతూ ఊడిపోతున్నాయి. కింద సిమెంటుతో ఫ్లోరింగ్ ఉండగా వీటికి పూసిన గమ్ ఉండటం లేదు. అవి చెల్లాచెదురుగా ఉండి అధ్వానంగా కనిపిస్తున్నాయి. హౌసింగ్‌బోర్డుకాలనీలో శనివారం ప్రారంభించిన పార్కులో రబ్బర్‌షీట్లు కనిపించలేదు. కొన్ని ఊడిపోవడంతో వాటిని తీసేశారు.

**తెలిసినా అదే పద్ధతి..**

వ్యాయామ పరికరాలు మొదట పది బిగించగా ఆయా ప్రాంతాల్లోంచి ఫిర్యాదులు వచ్చాయి. వర్షానికి నీరు నిలిచి.. అవి తేలిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఎండకు సాగడం, ఆ తర్వాత బిగుసుకుపోవడంతో అవి ఊడుతున్నట్లుగా గుర్తించారు. వాస్తవంగా బయట ప్రదేశాల్లో కాకుండా లోపలి భాగంలో ఎండ తగలని ప్రాంతాల్లో షీట్లు పనికి వస్తాయని అంటున్నారు. అదేదీ గుర్తించకుండా నగరమంతా ఒకే ఫార్ములా అన్నట్లుగా ఇంజినీరింగ్ అధికారులు వ్యవహరిస్తున్నారు.

**ఏజెన్సీ గుత్తేదారుదే బాధ్యత..**

పరికరాలు బిగించిన తర్వాత మూడేళ్లపాటు సంబంధిత ఏజెన్సీ గుత్తేదారే నిర్వహణ చూసుకోవాల్సి ఉంటుంది. నగరంలో మాత్రం కొత్తగా ఏర్పాటు చేసిన ఓపెన్‌జిమ్‌లు రెండేళ్లు అవుతున్నాయి. పరికరాలు విరిగినా, బేరింగ్‌లు పాడైనా మరమ్మతులు చేయాల్సి ఉండగా రోజుల తరబడి వదిలేస్తున్నారు. పద్మానగర్‌లో ఉన్న జిమ్‌లో ఒక పరికరం చెడిపోయి రోజులవుతోంది. బ్యాంకు కాలనీలో అలాగే ఉంచారు. వీటిని చూసిన నాథుడే లేరు. పలు చోట్ల ఆ ప్రాంగణాలు శుభ్రంగా ఉండటం లేదు. అత్యధిక ప్రాంతాల్లో రబ్బర్ షీట్లు ఊడిపోయి ఉన్నాయి.

**మరమ్మతులు చేయిస్తాం**

ఓపెన్‌జిమ్‌ల నిర్వహణను ఏజెన్సీ పర్యవేక్షించాల్సి ఉంటుంది. రబ్బర్‌షీట్లు ఊడిపోతే వెంటనే అతికించేలా చర్యలకు ఆదేశాలిస్తాం. పరికరాలను మరమ్మతులు చేయిస్తాం. ఫ్లోరింగ్ విషయంలో ఆలోచన చేస్తాం. నాగమల్లేశ్వరరావు, ఎస్ఈ, కరీంనగర్ నగర పాలిక సంస్థ

# ఉత్తి పోతల..



ఖమ్మం : సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఎత్తిపోతల పథకాలను మాత్రం నిర్వీర్యం చేస్తోంది. నిధుల లేమితో కొన్నేళ్లుగా అనేక పథకాలు పడకేశాయి. మరమ్మతులు చేయిస్తే కొన్ని సామర్థ్యం మేరకు పని చేసి ఆయకట్టుకు నీరందించే అవకాశం ఉన్నా... పాలకులు పట్టించుకున్న దాఖలాలు లేవు. జిల్లాలో సగానికి పైగా ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మారాయి. ఇప్పటికే 19 చిన్న పథకాలు ఎందుకూ పనికిరావని, వాటికి మరమ్మతులు చేసినా ప్రయోజనం లేదని జలవనరుల శాఖ ఇంజినీర్లు తేల్చేశారు. జిల్లాలో పలు పథకాల మోటార్లు మొరాయిస్తున్నాయి. ఏళ్ల తరబడి వాటికి మరమ్మతులు లేనందున పనికి రాకుండా పోతున్నాయి. కొన్నిచోట్ల పైపులైన్లు ధ్వంసమయ్యాయి. చాలా ప్రాంతాల్లో ఇనుప సామాను తస్కరణకు గురవుతోంది. ఉచిత విద్యుత్తు అందిస్తున్నా మోటార్లు పనిచేయక తమకు సాగునీరందని పరిస్థితి నెలకొందని ఆయకట్టు రైతులు వాపోతున్నారు.

ప్రభుత్వానికి నివేదిక జిల్లాలో 135 ఎత్తిపోతల పథకాలు ఉండగా 44,326 ఎకరాల ఆయకట్టు ఉంది. వీటిలో 50 పథకాలు మాత్రమే పూర్తిస్థాయిలో పనిచేస్తుండగా, 54 అసలే పనిచేయడం లేదు. పాక్షికంగా 12 పథకాలు పనిచేస్తున్నాయి. మరో 19 శిథిలమైపో యాయి. పని చేస్తున్న 50 పథకాల కింద 23,889 ఎకరాలు, పాక్షికంగా పనిచేసే వాటి కింద 9,296 ఎకరాల ఆయకట్టు ఉంది. మిగతా 11,141 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందక బీడుగా మారుతోంది. జిల్లాలో ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేసేందుకు రూ.30.21 కోట్లు కావాలని ప్రభుత్వానికి నివేదిక పంపారు. ప్రస్తుత వేసవిలో అయినా నిధులు మంజూరు చేస్తే మరమ్మతులు చేసే అవకాశం ఉంటుంది. ఎత్తిపోతల పథకాలు చిన్నపాటివి కొన్ని పనిచేయడం లేదు. పెద్దవి చాలా వరకు బాగున్నాయి. మరో మూడు నిర్మాణంలో ఉన్నాయి. త్వరలోనే పనులు పూర్తి చేసి ఆయకట్టు భూములకు సాగునీరందిస్తాం. మరమ్మతులకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి నివేదిక పంపించాం. నిధులు మంజూరైన తర్వాత పనులు చేపడతాం.

శంకర్‌నాయక్, సీఈ, జలవనరుల శాఖ, ఖమ్మం

సత్తుపల్లి, మధిర, పాలేరు నియోజకవర్గాల్లో ఎత్తిపోతల పథకాలు ఎక్కువగా ఉన్నాయి. మధిర నియోజకవర్గంలో 17, వైరాలో 2 పూర్తిగా వదిలేశారు. వీటికి మరమ్మతులు చేసినా వృథా అని తేల్చేశారు. దీంతో వాటిని లెక్కల్లోంచి తొలగించనున్నారు.

ఖమ్మం గ్రామీణ మండలంలో మున్నేరు నదిపై తీర్థాల వద్ద నిర్మించిన ఎత్తిపోతల పథకం రెండేళ్ల కిందట వరదకు పూర్తిగా కొట్టుకుపోయింది. ఇప్పటి వరకు మరమ్మతులకు నిధులు మంజూరు కాలేదు. ఇలాంటివి జిల్లాలో చాలా ఉన్నాయి. కల్లూరు మండలం కొర్లగూడెం–2, మధిర మండలంలో మహదేవపురం, బోనకల్లు మండలం రాపల్లెలో మూడు పథకాలు రూ.28 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తూనే ఉన్నారు. కొర్లగూడెం పథకం 70 శాతం, మహదేవపురం పథకం 60 శాతం, రాపల్లె 20 శాతం మాత్రమే పూర్తి చేశారు. వీటి నిర్మాణం పూర్తయితే 3,058 ఎకరాల భూమి సాగులోకి వస్తుంది.

# పరిహారం పేరిట పరిహాసం



ఖమ్మం : ఎస్ఆర్ఎస్పీ కాలువ తవ్వకానికి భూములు కోల్పోతున్న రైతులకు జలవనరుల శాఖ నుంచి చెల్లించాల్సిన పరిహారం పరిహాసంగా మారింది. జిల్లాకు ఎస్ఆర్ఎస్పీ కాలువల ద్వారా నీటిని అందించేందుకు 11 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం డీబీఎం–60 ప్రధాన కాలువను తవ్వింది. దీనికి అనుసంధానంగా కూసుమంచి ప్రాంతం వైపు నీరందించేందుకు 29ఆర్ కాలువ తీసింది. కోక్యాతండా ప్రాంతం నుంచి కూసుమంచితోపాటు గంగబండతండా, జుజ్జులరావుపేట, గట్టుసింగారం గ్రామ పంచాయతీల పరిధిలోని 4,800 ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు 7ఆర్ కాలువ తవ్వకం చేపట్టింది. ఇందుకు అవసరమైన భూసేకరణ చేసి కాలువ తవ్వకం చేపట్టారు. అయితే ఇందులో 14 మందికి సంబంధించి 11.18 ఎకరాల భూములకు పరిహారం చెల్లించే విషయంలో రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో కాలువ తవ్వకం పనులు నిలిచిపోయాయి. ఎస్ఆర్ఎస్పీ నీరు కూడా ఈ ప్రాంతానికి చేరడం గగనం కావడంతో ఎనిమిదేళ్లుగా ఈ అంశం మరుగున పడింది.

**భక్తరామదాసు అనుసంధానించడంతో..**

2017లో భక్తరామదాసు పథకాన్ని డీబీఎం 60కు అనుసంధానించారు. తద్వారా 7ఆర్ పరిధిలోని రైతుల డిమాండ్ మేరకు పరిహారం విషయం మళ్లీ తెరపైకి వచ్చింది. గత ఏడాది అక్టోబరులో ఎకరానికి రూ.15 లక్షల పరిహారం ఇచ్చేందుకు జలవనరుల శాఖ, రైతుల మధ్య ఒప్పందం కుదిరింది.

**ఆరు నెలలుగా జాప్యం..**

ఇరుపక్షాల ఒప్పందం నేపథ్యంలో ప్రభుత్వం గత ఏడాది అక్టోబరులో తగు జీఓ జారీ చేసింది. దీంతో రైతులకు పరిహారం చెల్లింపు, కాలువ తవ్వకం పనులు పూర్తయి వచ్చే సీజన్ నాటికైనా పాలేరు జలాలు తమ ప్రాంతానికి వస్తాయని 4,800 ఎకరాల ఆయకట్టు రైతులు ఆనందపడ్డారు. కానీ నేటికీ 11.18 ఎకరాల భూములు కోల్పోతున్న 14 మంది రైతులకు పరిహారం అందలేదు.

ఎస్ఆర్ఎస్పీ 7ఆర్ కాలువ కింద భూములు కోల్పోయిన రైతులకు పది రోజుల్లోగా పరిహారం మొత్తం బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యే అవకాశం ఉంది. సాంకేతిక పరమైన అంశం కారణంగా కొంత జాప్యం జరిగింది. చెల్లింపులు పూర్తయిన అనంతరం కాలువ తవ్వకం పనులు చేపడతాం. ఈ వేసవిలో పనులు చేపట్టి వచ్చే సీజన్‌లోగా నీరందిస్తాం. రమేశ్‌రెడ్డి, డీఈఈ జల వనరుల శాఖ

# ప్రకృతి కరుణించక..పెట్టుబడి సాయమందక!

ఖమ్మం:అన్నదాతలకు దన్నుగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తోంది. అయితే ఈ యాసంగి సీజన్‌కు సంబంధించిన పెట్టుబడి సాయం ఇప్పటివరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సుమారు 9వేల మందికి అందలేదు. ప్రధానంగా పదకొండు ఎకరాలకు పైబడి సాగు భూములున్న కర్షకులకు 'రైతుబంధు' సాయం అందలేదని తెలిసింది. వీరంతా మూడు నెలలుగా నిరీక్షిస్తున్నారు.

ఉభయ జిల్లాల్లో..ఖమ్మం జిల్లాలో సుమారు 4వేల మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో దాదాపు 5వేల మంది కర్షకులకు యాసంగి పెట్టుబడి సాయమందాల్సి ఉంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈసీజన్‌లో తీవ్ర జాప్యం జరుగుతోంది. యాసంగి సీజన్‌కు రైతుబంధు సాయం పంపిణీ ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా డిసెంబర్ 28న ప్రారంభమైంది. ఖమ్మం జిల్లాలో 3,07,611 మంది రైతులకు రూ.355.43 కోట్లు, భద్రాద్రి జిల్లాలో 1,45,000 మందికి రూ.214 కోట్లు అందాలి. ఎకరం లోపు భూవిస్తీర్ణం కలిగిన రైతులకు తొలిరోజు, రెండెకరాల లోపు ఉన్నవారికి రెండోరోజు.. ఇలా పదెకరాల లోపు రైతులకు పదిరోజుల్లోగా సొమ్ము బ్యాంకు ఖాతాల్లో జమవుతుంది. ఈప్రక్రియ సుమారు 15 నుంచి 20 రోజుల్లోపు పూర్తవుతుంది. పదెకరాల్లోపు భూమి ఉన్న రైతులకు తొలి పది రోజుల్లోనే పెట్టుబడి సాయమందింది. ఆ తర్వాత నుంచి ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

**ఇంకెన్నాళ్లో ఎదురుచూపులు?**

మూడు నెలలు దాటుతున్నా ఉభయ జిల్లాల్లో వేలాది మంది అన్నదాతలకు రైతుబంధు సొమ్ము అందలేదు. వ్యవసాయశాఖ కార్యాలయాలు, కలెక్టరేట్ల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేస్తున్నారు. అసలే ఈసారి సీజన్ కర్షకులకు పరీక్ష పెట్టింది. దిగుబడులు గణనీయంగా తగ్గిపోయాయి. పత్తి, మిర్చి పంటలకు గిట్టుబాటు ధర దక్కలేదు. ఇవి చాలదన్నట్టు అకాల వర్షాలూ నిండా ముంచాయి. ప్రకృతి కరుణించక.. పెట్టుబడి సాయమందక అన్నదాతలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆన్‌లైన్‌లో పొందుపరిచిన వివరాల ప్రకారమే రైతుల బ్యాంకు ఖాతాల్లో పెట్టుబడి సాయం జమవుతుందని వ్యవసాయశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.




కొంతమంది కర్షకులకు సంబంధించి ట్రెజరీలో పెండింగ్ అని చూపుతోందని చెబుతున్నారు.

నాకు పదకొండున్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 'రైతుబంధు' ద్వారా పెట్టుబడి సాయం రూ.57,500 అందాలి. కొంతమంది రైతుల ఖాతాల్లో సొమ్ము జమైనా నాకు మాత్రం అందలేదు. మూడు నెలలు గడుస్తున్నా రైతుబంధు సొమ్ము అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. పెట్టుబడి సాయమందేలా అధికారులు కృషి చేయాలి.

ఏలూరి జగదీశ్వరరావు, మద్దుకూరు, చంద్రుగొండ మండలం

గోపాలపురంలో నాకు 13.30 ఎకరాల భూమి ఉంది. రూ.65 వేలకుపైనే రైతుబంధు సొమ్ము రావాలి. ఈ సీజన్‌లో ఇప్పటివరకు నా బ్యాంకు ఖాతాలో సొమ్ము జమకాలేదు. వ్యవసాయశాఖ అధికారులను అడిగితే రేపు, మాపు అంటున్నారు. గతంలో ఎప్పుడూ ఇంత జాప్యం జరగలేదు. అధికారులు స్పందించి వెంటనే పెట్టుబడి సాయమందేలా చూడాలి.

రాచూరి ముక్తేశ్వరరావు, గోపాలపురం, దమ్మపేట మండలం

# నెరవేరని సింగరేణి ఉత్పత్తి లక్ష్యం

భూపాలపల్లి : భూపాలపల్లి ఏరియా సింగరేణి వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించలేకపోయింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో 57శాతం ఉత్పత్తినే సాధించగలిగింది. 49.60 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యం ఉండగా కేవలం 28.50 లక్షల టన్నుల ఉత్పత్తే జరిగింది. సింగరేణి సంస్థ మొత్తంగా 74మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యం నిర్దేశించుకోగా 67.13లక్షల టన్నులు చేసి 91శాతంతో నిలిచింది. ఈ సారి భారీ వర్షాలు కురవడంతో ఉపరితల గనుల్లో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగింది. దీంతో గత ఏడాది ఆశించిన ఫలితాలు రాబట్టకపోకపోవడంతో వార్షిక ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోలేపోయింది.

సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో ఐదు డివిజన్లలో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తిని అధిగమించింది. ఇల్లెందు 108 శాతం, ఆర్జీ–1 120శాతం, ఆర్జీ–2 100శాతం, శ్రీరాంపూర్ 102శాతం, మణుగూరు 103శాతం ఏరియాలు లక్ష్యం సాధించాయి. భూపాలపల్లి ఏరియా 57శాతంతో చివరి స్థానంలో ఉండగా, కొత్తగూడెం, ఆర్జీ–3లు ఏరియాలు లక్ష్యానికి



దగ్గరగా ఉండిపోయాయి.

**అనుకూలించని పరిస్థితులు**

భూపాలపల్లి అన్ని డివిజన్ల కంటే బొగ్గు ఉత్పత్తిలో వెనుకంజలో నిలిచింది. లక్ష్యం 49.60 లక్షల టన్నులకుగాను కేవలం 28.50 లక్షల టన్నులు చేసి 57 శాతంతో నిలిచింది. ఉపరితల గనుల్లో మట్టి వెలికితీత లక్ష్యాన్ని చేధించలేకపోయాయి. దీంతో సకాలంలో బొగ్గు వెలికితీత జరగలేదు. కార్మికుల గైర్హాజరు శాతం పెరగడం మరో కారణం కాగా కౌన్సెలింగ్ ఇచ్చిన ప్రయోజనం లేదు.

# రూ.కోట్లు వ్యయం.. అలంకారప్రాయం

పెద్దపల్లి : పల్లెల్లో ఆఖరి మజిలీ కష్టాలు తీర్చేందుకు 'వైకుంఠధామం' పేరిట నిర్మించిన శ్మశానవాటికలు అధ్వానంగా మారాయి. మొక్కుబడి పనులతో నాణ్యత లోపించి పగుళ్లు బారాయి. గతేడాది భారీ వర్షాలకు దెబ్బతిన్నా మరమ్మతులు కరవయ్యాయి. చాలా చోట్ల అసంపూర్తి నిర్మాణాలు వెక్కిరిస్తున్నాయి. బోరు, విద్యుత్తు వసతి సమకూర్చలేదు. రూ.కోట్లు వెచ్చించినా అలంకారప్రాయంగా వెక్కిరిస్తున్నాయి. స్థలాల కొరత, ఇతర కారణాలతో అనువైన ప్రాంతాల్లో నిర్మించలేదన్న ఆరోపణలున్నాయి. జిల్లాలో వైకుంఠధామాల పరిస్థితిపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

నీటి వసతి.. విద్యుత్తు లేదుఒక్కో శ్మశానవాటిక నిర్మాణానికి ఉపాధిహామీ కింద రూ.10 లక్షలు చొప్పున మంజూరు చేశారు. మొదట్లో ఉపాధిహామీ సిబ్బంది పర్యవేక్షించగా పల్లెప్రగతి ప్రాధాన్యత పనుల పరిధిలోకి తీసుకొని పంచాయతీరాజ్ శాఖకు బదిలీ చేశారు. జిల్లాలో 264 శ్మశానవాటికలకు గాను 116 ఉపాధిహామీ, 145 పంచాయతీరాజ్, 3 సింగరేణి ఆధ్వర్యంలో చేపట్టారు. బోరు, విద్యుత్తు కనెక్షన్ల కోసం నిధులు వినియోగించుకోవాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నా చాలా చోట్ల అమలుకు నోచుకోలేదు. మిషన్ భగీరథ కనెక్షన్ తీసుకోవాలని ఆదేశించినా ఊరికి దూరంగా ఉండటంతో సాధ్యం కావడం లేదు. బోరుబావి ఉన్నా నీటి కష్టాలే! పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లిలోని శ్మశానవాటికకు బోరుబావి ఉన్నా విద్యుత్తు కనెక్షను లేదు. డీడీ కడితేనే కనెక్షన్ ఇస్తామని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో తాత్కాలికంగా కొద్ది దూరంలోని స్తంభం నుంచి కనెక్షన్ తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. డీడీ చెల్లించేందుకు నిధుల కొరత అడ్డంకిగా మారింది.

**దెబ్బతిన్న వైకుంఠధామం**

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ మండలం కిష్టంపేటలో మానేరు ఒడ్డున నిర్మించారు. గతేడాది భారీ వర్షాలకు వాగు ఉద్ధృతంగా ప్రవహించింది. వరద ధాటికి దెబ్బతిన్నా మరమ్మతు చేయడం లేదు. కొన్ని గ్రామాల్లో స్థలాల ఎంపిక ప్రహసనంగా మారింది. నీటి వసతులు కల్పించపోవడంతో నిరుపయోగంగానే ఉన్నాయి.

**ఆరుబయట స్నానాలు**

సెంటినరీకాలనీ: పన్నూరులోని వైకుంఠధామంలో తవ్విన బోర్లు సింగరేణి ఉపరితల గనుల పేలుళ్ల కారణంగా కుప్పకూలాయి. దీంతో స్నానాల గదులు నిరుపయోగంగా మారాయి. వైకుంఠధామంలో నీరు రాకపోవడంతో అంత్యక్రియలకు హాజరైన వారు గతంలో సింగరేణి ఏర్పాటు చేసిన బోరుబావి వద్ద స్నానాలు చేస్తున్నారు.

**పిల్లర్లకే పరిమితం**

సుల్తానాబాద్: సుల్తానాబాద్ పురపాలక సంఘం పరిధిలో వైకుంఠధామం అస్తవ్యస్తంగా తయారైంది. పంచాయతీగా ఉన్న సమయంలో రూ.10 లక్షలు కేటాయించగా పనులు పిల్లర్ల దశలోనే ఉన్నాయి. అంత్యక్రియల నిర్వహణకు, కర్మకాండలు జరపడానికి గదులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

**ఊరికి దూరంగా నిర్మాణాలు**

ఓదెల: మడకలో మానేరు ఒడ్డున నిర్మించిన శ్మశానవాటిక ప్రవాహ ఉద్ధృతికి పూర్తిగా నేలమట్టమైంది. ఉప్పరపల్లె, హరిపురం, లంబాడితండ, కనగర్తి గ్రామాల్లో ఊరికి దూరంగా నిర్మించడంతో నిరుపయోగంగా మారాయి. పలు చోట్ల నీటి సౌకర్యం అంతంతమాత్రంగానే ఉండగా, విద్యుత్ సరఫరా ఎక్కడా లేదు.

**ధర్మారం ఆదర్శం**

ధర్మారం: మండలంలో మల్లాపూర్ మినహా అన్ని చోట్లా వినియోగంలోకి వచ్చాయి. మల్లాపూర్‌లో నిర్మాణాలు పూర్తయినా దారి లేక నిరుపయోగంగా మారింది. ఎర్రగుంటపల్లి, కొత్తపల్లి, న్యూకొత్తపల్లి, లంబాడితండా(కె), మల్లాపూర్, నాయకంపల్లి, రామయ్యపల్లి శ్మశానవాటికలకు నీటి వసతి లేకపోవడంతో అవసరమైనప్పుడు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. 12 చోట్ల విద్యుత్తు వసతి లేకపోవడంతో సమీపంలోని వ్యవసాయ బావుల నుంచి వాడుకుంటున్నారు.

**జిల్లాలో వైకుంఠధామాల పరిస్థితి**

మొత్తం శ్మశానవాటికలు 264
నిర్మించినవి : 263
అంచనా వ్యయం రూ.31.11 కోట్లు
ఖర్చైనవి: రూ.28.34 కోట్లు

# వైసీపీ కీలక నేతలతో సీఎం జగన్ అత్యవసర భేటీ..!



అమరావతి: వైసీపీ కీలక నేతలతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లి నివాసంలో అత్యవసరంగా భేటీ అయినట్లు తెలుస్తోంది. సజ్జలరామకృష్ణారెడ్డి, విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉమారెడ్డి వెంకటేశ్వర్లు, వైవీ సుబ్బారెడ్డిలు ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా ఎన్నికలకు ఎలా సమాయత్తం కావాలనే అంశంపై ఈ సమావేశంలో చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టు తదనంతర పరిణామాలపైనా, ఎన్నికలకు సంబంధించిన పలు విషయాలపై కసరత్తు, గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు పరచడంలో కొంత ఇబ్బందులు తలెత్తిన సందర్భంలో ఈసారి మేనిఫెస్టోను పకడ్బందీగా అమలు చేసేలా కార్యచరణ రూపొందించినట్లుగా తెలియవచ్చింది. గత ఎన్నికలకు ముందు మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా ఉమారెడ్డి వెంకటేశ్వర్లు ఉన్నారు. ఈసారి కూడా ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలు ఉన్నాయి. గత మేనిఫెస్టోలో మధ్యపాననిషేదం, ఉద్యోగులందరికీ ఇళ్ల స్థలాలు, సీపీఎస్ రద్దు వంటి హామీలను ఇవ్వడం వల్ల ప్రజల్లో పార్టీపై వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ఈ అంశంపై కూడా సమావేశంలో చర్చించారు. ఈసారి మేనిఫెస్టోను అమోదయోగ్యమైన హామీలను పొందుపరిచేలా వైసీపీ కీలక నేతలకు సీఎం జగన్‌రెడ్డి ఆదేశించినట్లు తెలుస్తోంది.

# సేవ్ ఏపీ అంటూ రాష్ట్రపతికి లక్ష పోస్ట్ కార్డులు



ఢిల్లీ: చంద్రబాబుకు మద్దతుగా చేపట్టిన లక్ష పోస్ట్ కార్డుల ఉద్యమం ఢిల్లీకి చేరింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఏపీ ప్రజలు లక్ష పోస్టు కార్డులు రాశారు. "సేవ్ ఆంధ్ర ప్రదేశ్ ,సేవ్ డెమోక్రసీ" అంటూ చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్ కు లక్ష పోస్టు కార్డులు ఏపీ ప్రజలు పంపించారు.

చంద్రబాబు అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ "లక్ష పోస్ట్ కార్డులు" రాయాలని ఏపీ ప్రజలకు శ్రీకాకుళంకు చెందిన టీడీపీ నేత కలిశెట్టి అప్పలనాయుడు పిలుపునిచ్చారు.

వివిధ వర్గాల నుంచి చంద్రబాబు అక్రమ అరెస్టు నిరసిస్తూ సంతకం చేసి రాసిన పోస్ట్ కార్డులను రాష్ట్రప్రతి కార్యాలయానికి అప్పలనాయుడు అందించారు. చంద్రబాబు అక్రమ అరెస్టు నేపథ్యంలో ప్రతి ఒక్కరు పోస్ట్ కార్డు రాయాలని అప్పలనాయుడు కోరారు.

# దుర్గగుడిలో బయటపడ్డ విభేదాలు



విజయవాడ: ప్రముఖ పుణ్యక్షేత్రం కనకదుర్గమ్మ ఆలయంలో విభేదాలు మరోసారి బయటపడ్డాయి. కీలకమైన దసరా కోఆర్డినేషన్ మీటింగ్‌కు దుర్గగుడి చైర్మన్‌కు ఆహ్వానం అందని పరిస్థితి. దుర్గగుడి కింద జమ్మిదొడ్డిలో కోఆర్డినేషన్ మీటింగ్‌కు కలెక్టర్, సీపీ, ఈవో, ఎండోమెంట్ అధికారులు హాజరయ్యారు.

తనును మీటింగ్‌కు పిలవకుండా ప్రొటోకాల్ పాటించలేదని చైర్మన్ కర్నాటి రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో చైర్మన్ చాంబర్‌లో పాలకమండలి సభ్యులు సమావేశమయ్యారు. దసరా కోఆర్డినేషన్ మీటింగ్‌కు హాజరైన ఈవోపై పాలకమండలి సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవాదాయశాఖమంత్రికి ఫిర్యాదు చేస్తామని చైర్మన్, పాలకమండలి సభ్యులు తెలిపారు.

# బ్రహ్మోత్సవాల నేపథ్యంలో 9 రోజుల పాటు అన్ని ప్రత్యేక దర్శనాల రద్దు..



తిరుమల : ఈ నెల 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని టీటీడీ ఈవో ధర్మారెడ్డి వెల్లడించారు. అక్టోబర్ 19వ తేదీన గరుడ సేవ, 20వ పుష్పక విమానం, 22న స్వర్ణరథం, 23న జరిగే చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. వాహన సేవలను తిలకించేందుకు భారీగా భక్తులు తరలి వచ్చే అవకాశం ఉందన్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గరుడ సేవను సాయంత్రం 6.15 నిమిషాలకే ప్రారంభించేందుకే సన్నాహాలు చేస్తున్నామని ధర్మారెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాలు 9 రోజుల పాటు అన్ని ప్రత్యేక దర్శనాలను రద్దు చేస్తున్నామన్నారు. 15 రాష్ట్రాల నుంచి వచ్చే కళా బృందాలు వాహన సేవల ముందు ప్రదర్శనలు ఇస్తాయన్నారు. వాహన సేవలను తిలకించేందుకు వచ్చే భక్తులకు నిరంతరాయంగా అన్నపానీయాలను సరఫరా చేస్తామని టీటీడీ ఈవో ధర్మారెడ్డి వెల్లడించారు. బ్రహ్మోత్సవాల సమయంలో ప్రభుత్వం తరుపున టీటీడీకి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఉత్సవాల సమయంలో ప్రభుత్వం తరుపున పర్యవేక్షణ చేసేందుకు ప్రత్యేకంగా అధికారులను నియమిస్తున్నామన్నారు.

బ్రహ్మోత్సవాలని తిలకించేందుకు దేశం నల మూలల నుంచి భక్తులు తరలి వచ్చే అవకాశం ఉందని తిరుపతి అర్బన్ ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ క్రమంలోనే పోలీస్ శాఖ తరుపున పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

# జగన్ జోక్స్ విని మహిళలు నవ్వుతున్నారు



విశాఖపట్నం : టీడీపీ అధినేత చంద్రబాబు త్వరలో విడుదల కావాలంటూ మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఫిఫ్త్ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద గల శ్రీ యోగ సిద్ధి ఆంజనేయ స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పదేళ్ల క్రితం ఆర్థిక నేరాలతో అరెస్టయి బెయిల్ పై ఉన్న వ్యక్తి జగన్ అని అన్నారు. నీతిపరుడు... 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ అనుభవం గల మహనీయుడు.. 14 ఏళ్లు పరిపాలన చేసిన చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేశారని గంటా అన్నారు. ఫెడరల్ క్యాస్ట్రో చెప్పినట్టుగా అవినీతిపరులు రాజమేలుతుంటే నీతిపరులు జైలు పాలు అవుతారనే విధంగా ఈ రోజు జగన్మోహన్ రెడ్డి వైనం ఉందన్నారు. నిన్న వైసీపీ వారి విస్తృత స్థాయి సమావేశంలో జగన్మోహన్ రెడ్డి జోక్స్ వేశారని గంటా ఎద్దేవా చేశారు.

ఆ జోక్స్ విని మహిళలు నవ్వుకుంటున్నారన్నారు. చంద్రబాబు నాయుడు అరెస్టు అయిన సంగతి జగన్మోహన్ రెడ్డికి తెలియదని చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అంటే జగన్మోహన్ రెడ్డికి తెలియకుండానే అధికారులు అరెస్టు చేశారని చెప్పడం హాస్యాస్పదమని గంటా అన్నారు.

# భువనేశ్వరిపై విమర్శలు చేసినప్పుడు ఆ హీరోయిన్లు ఎందుకు స్పందించలేదు?



రాజమండ్రి: 74 సంవత్సరాల వయస్సులో టీడీపీ అధినేత చంద్రబాబు రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉండటం బాధాకరమని టీడీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. మంగళవారం మీడియాతూ... తమకు న్యాయ వ్యవస్థ పై నమ్మకం ఉందన్నారు. నాలుగున్నర ఏళ్లలో ఎప్పుడు లేని విధంగా జగన్ సమావేశం పెట్టి నాలుగు పథకాలు ప్రకటించారన్నారు. జగన్ పోవాలని జనం అనుకుంటున్నారని.. జగన్ రోడ్డు పైకి వస్తే చీపుర్లతో కొట్టడానికి జనం సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యలు చేశారు. వైసీపీ నేతలను జనం తన్నితరుముతారన్నారు. రోజాకు సంఘీబావం తెలిపే హీరోయిన్లు నారా భువనేశ్వరిపై విమర్శలు చేసినప్పుడు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. చంద్రబాబును అరెస్ట్ చేస్తారని తెలిసే జగన్ లండన్ పారిపోయారంటూ వ్యాఖ్యలు చేశారు. జగన్‌కు తెలియకుండానే పోలీసులు చంద్రబాబును అరెస్ట్ చేస్తారా అని ప్రశ్నించారు. టీడీపీ నేతలు అన్ని రాజకీయ పార్టీల్లోనూ ఉన్నారని వంగలపూడి అనిత వెల్లడించారు.



# మాయమైన మానవత్వం
# పొదల్లో దాక్కున్నా వెతికి మరీ చంపారు

జెరూసలెం: మాయా ఆల్వర్.. ఇజ్రాయెలీల మ్యూజిక్ పార్టీలో బార్ వెనుక పర్యావరణ వాలంటీర్లతో కలిసి విధులు నిర్వహిస్తున్నారు.. వారి పని పార్టీలో చెత్తను ఏరివేయడంతోపాటు అక్కడికొచ్చిన వారికి వోడ్కా అందించడం.. ఉదయం ఆరు గంటలవుతోంది.. స్టేజీ మీద డీజే ప్రదర్శన సాగుతోంది. సరిగ్గా అప్పుడు సంగీతాన్ని చీల్చుకుంటూ హెచ్చరిక సైరన్ వచ్చింది. రాకెట్లు పడుతున్నాయి. దీంతో వెంటనే 25 ఏళ్ల ఆల్వర్ తన కారులోకి దూకేసి.. మెయిన్ రోడ్డుపైకి దూసుకొచ్చారు. కానీ అప్పటికే చాలామంది రోడ్డుపైకి రావడంతో ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. భయకంపితులైన యువతీయువకులు కార్లను వదిలి రోడ్లపై పరుగెడుతూ రక్తసిక్తమై ఆల్వర్ ఎదుటే కుప్పకూలిపోయారు. అలా.. 260 మంది ఒక్కచోటే ప్రాణాలొదిలారు. ఇదీ.. ఇజ్రాయెల్‌లో నోవా సంగీత సంబరంలో చోటుచేసుకున్న మాటలకందని విషాదం. హమాస్ మిలిటెంట్లు విచ్చలవిడిగా చేసిన దాడికి సాక్షీభూతం. గాజా సరిహద్దులోని కిబ్బుజ్ రీమ్‌వద్ద జరిగిన ఈ సంగీత సంబరానికి సుమారు 3,000 మంది హాజరయ్యారు. శనివారం ఉదయం కొన్ని నిమిషాల్లోనే పలు వ్యాన్లలో 50 మంది సాయుధ ముష్కరులు అక్కడికి వచ్చారు. వీక్షకులపై తూటాల వర్షం కురిపించారు. దీంతో సంగీత సంబరానికి వచ్చిన వారంతా నిస్సహాయులుగా మిగిలిపోయారు. ఈ దారుణం జరుగుతున్నప్పుడు రోడ్డుపై నిస్సహాయంగా ఉన్న కొంత మందిని ఆల్వర్ తన కారులో ఎక్కించుకున్నారు. వ్యతిరేక దిశగా కారును వేగంగా పోనిచ్చి ప్రాణాలను కాపాడుకున్నారు. కారులో ఎక్కిన వారిలో ఒక వ్యక్తి సీట్లో కూర్చుని కారు వెనుక అద్దంలో చూస్తూ.. 'మనం చనిపోబోతున్నాం' అని గట్టిగా అరుస్తూనే ఉన్నాడు. ఆల్వర్ కారు నడుపుతుండగా.. సమీపంలోకి ఒక వ్యక్తి వచ్చి 'దేవుడు గొప్పవాడు' అని అరవడం ప్రారంభించాడు. దీంతో భయపడిన వారంతా కారు దిగి సమీపంలోని పొదల్లోకి పరుగెత్తారు. ఒక బుల్లెట్ ఆల్వర్ చెవి పక్క నుంచి వెళ్లింది. దీంతో ఆమె ఒక్కసారిగా పొదల్లోకి దూకారు. కారులో వచ్చిన ఓ యువతీ కుప్పకూలిపోయింది. ఆమె మృతదేహం పక్కనే సాయుధుడు నిల్చుని ఉన్నాడు. 6 గంటలపాటు ఆల్వర్‌తోపాటు వేల మంది పార్టీకి వచ్చిన వారు ఇజ్రాయెల్ సైన్యం సాయం కోసం ఎదురుచూశారు. పొదల్లోకి దూకడంతో ఆమె చేతులన్నీ దెబ్బతిన్నాయి. ఆ పొదలే తమను కాపాడాయని ఆల్వర్ తెలిపారు. ఇజ్రాయెలీ ట్యాంకరు వచ్చాక ఆ శబ్దాలు విన్నాకే తాను క్షేమమని అనుకున్నానని ఆమె వివరించారు. ఆల్వర్ గట్టిగా అరవడంతో సైనికులు వచ్చి ఆమెను పొదల నుంచి రక్షించారు.



# 1500 మంది హమాస్ ఉగ్రవాదులు హతం..!

జెరూసలెం: తమ దేశంపై మెరుపు దాడికి దిగిన హమాస్ మిలిటెంట్లను ఇజ్రాయెల్ సైన్యం దీటుగా ప్రతిఘటించింది. దేశంలోకి చొరబడిన ఉగ్రవాదులను ఎక్కడికక్కడ ఏరిపారేసింది. దాదాపు 1500 మంది ముష్కరులను హతమార్చినట్లు ఇజ్రాయెల్ సైన్యం మంగళవారం ప్రకటించింది. సరిహద్దులు కూడా పూర్తిగా తమ అధీనంలోకి వచ్చినట్లు తెలిపింది. "గాజా స్ట్రిప్ చుట్టూ ఉన్న ఇజ్రాయెల్ భూభాగంలో దాదాపు 1500 మంది హమాస్ మిలిటెంట్ల మృతదేహాలను గుర్తించాం. దక్షిణ ఇజ్రాయెల్‌లో హమాస్ ఉగ్రవాదులు చొరబడిన ప్రాంతాలను తిరిగి మా అధీనంలోకి తీసుకున్నాం. సరిహద్దుల వెంబడి కూడా పరిస్థితి పూర్తిగా మా నియంత్రణలోకి వచ్చింది" అని ఇజ్రాయెల్ ఆర్మీ అధికార ప్రతినిధి రిచర్డ్ హెచ్ మీడియాకు వెల్లడించారు. అంతేగాక, గత రాత్రి నుంచి ఒక్క హమాస్ ఉగ్రవాది కూడా సరిహద్దులు దాటలేదని పేర్కొన్నారు. అయితే ఇప్పటికీ చొరబాట్లు జరిగే అవకాశముందని తెలిపారు. ఇజ్రాయెల్‌లో హమాస్ ఉగ్రవాదులు జరిపిన అత్యంత పాశవిక మారణహోమంలో మృతుల సంఖ్య 900కు చేరుకుంది. అటు గాజాలో ఇజ్రాయెల్ సైన్యం జరిపిన వైమానిక దాడుల్లో మరణించిన వారి సంఖ్య 680కు పెరిగినట్లు పాలస్తీనా అధికారులు వెల్లడించారు. మరోవైపు, సరిహద్దుల్లో హమాస్ మిలిటెంట్లు, ఇజ్రాయెల్ సైన్యం మధ్య నాలుగో రోజు పోరు కొనసాగుతోంది.

**ఇజ్రాయెల్‌కు అమెరికా మందుగుండు..** ఇదిలా ఉండగా.. హమాస్ దాడిని ఎదుర్కొనేందుకు ఇజ్రాయెల్‌కు అన్ని విధాలా అండగా ఉంటామని అగ్రరాజ్యం అమెరికా (%ఖూాా%) ప్రకటించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఇజ్రాయెల్‌కు కీలకమైన మందుగుండు, మిలిటరీ పరికరాల డెలివరీని ప్రారంభించింది. ఇప్పటికే, విమాన వాహకనౌక, యుద్ధ నౌకలను అమెరికా ఇజ్రాయెల్ తీరానికి పంపించిన విషయం తెలిసిందే. అయితే ఈ యుద్ధంలో నేరుగా కాలుపెట్టే (అమెరికా సైన్యాన్ని పంపడంపై స్పందిస్తూ) ఉద్దేశం తమకు లేదని అమెరికా జాతీయ భద్రతా మండలి ప్రతినిధి జాన్ కిర్బీ స్పష్టం చేశారు.

# 'ఏపీ నీడ్స్ జగన్'.. కాదు 'ఏపీ హేట్స్ జగన్': అచ్చెన్నాయుడు



అమరావతి: తెదేపా అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా నిరసన తెలిపిన వారందరిపై కేసులు పెట్టడం హేయమైన చర్య అని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. శాంతియుతంగా చేసే నిరసనలపై పోలీసులు కావాలనే కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టం అందరికీ సమానమైనప్పుడు కేవలం ప్రతిపక్ష నాయకులపై కేసులెందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీలు ఎటువంటి కార్యక్రమానికి పిలుపునిచ్చినా వెంటనే ముందస్తు అరెస్టులు చేయడం పోలీసులకు పరిపాటిగా మారిందన్నారు. సీఎం జగన్ చట్టాన్ని చుట్టంలా వాడుకుంటూ కొంత మంది పోలీసులను వైకాపా ప్రైవేటు సైన్యంలా మార్చుకొని అరాచకాలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా ప్రతిపక్ష నాయకులకు మాట్లాడే స్వేచ్ఛ లేదని.. చివరకు గాలి పీల్చాలన్నా జగన్ అనుమతి కావాలంటారేమోనని వ్యాఖ్యానించారు. ఇలాంటి నియంతృత్వ పాలనకు చరమగీతం పాడే సమయం వచ్చిందన్నారు. జగన్ చేస్తున్న అరాచకాలను బడుగు, బలహీన వర్గాల ప్రజలు భరించలేకపోతున్నారని అన్నారు.

'ఏపీ నీడ్స్ జగన్'.. కాదు 'ఏపీ హేట్స్ జగన్' అని ప్రజలు పిలుపునిస్తున్నారని అచ్చెన్నాయుడు విమర్శించారు.

# పవన్‌కి వైరల్ ఫీవర్.. రేపటి కీలక సమావేశం వాయిదా



అమరావతి: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వైరల్ ఫీవర్‌తో ఇబ్బందిపడుతున్నారు దీంతో రేపు జరగాల్సిన జనసేన విస్తృత స్థాయి సమావేశం వాయిదా పడింది. క్షేత్ర స్థాయిలో తెలుగుదేశం పార్టీతో కలిసి వెళ్లే అంశంపై పవన్ రేపు పార్టీ నేతలకు దిశానిర్దేశం చేసేందుకు ఈ కీలక సమావేశం ఏర్పాటు చేశారు. పవన్‌కు వైనల్ ఫీవర్ రావడంతో ఈ సమావేశం వాయిదా పడినట్లు తెలుస్తోంది. త్వరలో మరో తేదీ ప్రకటిస్తామని జనసేన నేతలు ఓ ప్రకటన విడుదల చేశారు.

# ముందస్తు ఎన్నికలొస్తే జగన్ ఇంటికి వెళ్లడం ఖాయం




ఒంగోలు: ఏపీకి ముందస్తు ఎన్నికలొస్తే సీఎం జగన్ ఇంటికి వెళ్లడం ఖాయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ వ్యాఖ్యానించారు. ఏపీలో టీడీపీ, జనసేనతో కలిసి పోటీ చేయడానికి వ్యూహాన్ని రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రధాని మోదీ సహకారంతోనే టీడీపీ అధినేత చంద్రబాబును జైలుకు పంపారని ఆయన ఆరోపించారు. బాబు అరెస్టు విషయంలో సీఐడీ చెబుతున్న అంశాల్లో డొల్లతనం కనిపిస్తోందన్నారు. ఆధారాలు లేకుండా చంద్రబాబును సీఐడీ అరెస్టు చేసిందన్నారు. తాడేపల్లి కేంద్రంగా మద్యం వ్యాపారం జరుగుతోందని రామకృష్ణ ఆరోపించారు. చంద్రబాబు తప్పు చేస్తే అరెస్టు చేయకూడదని తాను చెప్పనని.. కానీ ఇవాళ ప్రభుత్వం చెబుతున్న సమాధానం ఎంత డొల్లతనంగా ఉందో అర్థమవుతోందని రామకృష్ణ అన్నారు. చంద్రబాబును అరెస్టు చేసిన తర్వాత ఆధారాలు సేకరిస్తామని చెబుతున్నారని, అరెస్టు చేసి నెలరోజులు అవుతోందని, ఇంతవరకు ఆధారాలు చూపలేదని రామకృష్ణ మండిపడ్డారు.

# బ్లాక్ లో మెరిసి పోతున్న 'లైగర్' బ్యూటీ

స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2 తో బాలీవుడ్ లో అడుగు పెట్టిన స్టార్ కిడ్ అనన్య పాండే. ఈ అమ్మడు తక్కువ సమయంలోనే సౌత్ లో కూడా ఎంట్రీ ఇచ్చింది. విజయ్ దేవరకొండ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిన 'లైగర్' సినిమాలో ఈ అమ్మడు నటించడం ద్వారా సౌత్ లో కూడా గుర్తింపును దక్కించుకుంది. లైగర్ సినిమా నిరాశ పర్చడంతో సౌత్ లో కంటే బాలీవుడ్ పై ఎక్కువ దృష్టి పెట్టాలనే ఉద్దేశ్యంతో ప్రస్తుతం అక్కడే సినిమాలు చేస్తూ ఉంది. ఈ ఏడాది ఇప్పటికే రెండు సినిమాలతో వచ్చిన ఈ అమ్మడు మరో సినిమా తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతోంది. ఇక మరో రెండు సినిమాలు షూటింగ్ దశలో ఉన్నట్లుగా సమాచారం



అందుతోంది. ప్రస్తుతం చేస్తున్న సినిమాలు మాత్రమే కాకుండా మరో రెండు మూడు హిందీ సినిమాలకు కమిట్ అయిన ముద్దుగుమ్మ అనన్య పాండే సోషల్ మీడియాలో రెగ్యులర్ గా అందాల ఆరబోత ఫోటో షూట్ ని షేర్ చేస్తూ ఉంటుంది. హీరోయిన్ గా ఇప్పటి వరకు కమర్షియల్ బ్లాక్ బస్టర్ అందుకోలేదు.. కానీ మోడల్ గా మాత్రం స్టార్ హీరోయిన్స్ కి పోటీగా నిలుస్తోంది. తాజాగా ఒక కొత్త బ్రాండ్ ను పరిచయం చేస్తూ అనన్య పాండే షేర్ చేసిన ఫోటోలు కన్నుల విందుగా ఉన్నాయి. విభిన్నమైన ఔట్ ఫిట్ లో అన్ని ఫోటోలు కూడా భలే ఉన్నాయే అన్నట్లుగా నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ముఖ్యంగా ఈ బ్లాక్ డ్రెస్ లో చూపు తిప్పుకోనివ్వడం లేదు అన్నట్లుగా కామెంట్స్ వస్తున్నాయి. స్కిన్ షో చేయకున్నా కూడా బ్లాక్ డ్రెస్ లో అనన్య చాలా అందంగా కనిపిస్తుంది అనేది నెటిజన్స్ మాట.

## ఐకాన్ స్టార్ మైనపు విగ్రహం కోసం కొలతలు ఇచ్చేశాడు

స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ ఇప్పుడు సిసలైన ఐకాన్ స్టార్ గా ఎదిగాడు. టాలీవుడ్ సూపర్‌స్టార్ గానే కాదు, ఇప్పుడు పాన్ ఇండియా స్టార్‌గాను అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. పుష్ప చిత్రంతో అతడు అసాధారణ ఫీట్ ని తన సొంతం చేసుకున్నాడు. 90 ఏళ్ల తెలుగు సినిమా హిస్టరీలో ఉత్తమ నటుడిగా జాతీయ చలనచిత్ర అవార్డును గెలుచుకున్న తొలి తెలుగు హీరోగా ఘనుతికెక్కాడు. యాధృచ్ఛికంగా బన్నీకి పెరిగిన ఇమేజ్ కి తగ్గట్టే ఒక్కొక్కటిగా తన వైపునకు నడిచి వస్తున్నాయి. ఇందులో అత్యంత కీలకమైనది మేడమ్ టుస్సాడ్స్ మైనపు విగ్రహం. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన మేడమ్ టుస్సాడ్స్-దుబాయ్ లోని మైనపు మ్యూజియంలో అల్లు అర్జున్ మైనపు విగ్రహం కొలువు దీరనుందని ఇప్పటికే కథనాలొచ్చాయి. ఇటీవల మేడమ్ టుస్సాడ్స్ అధికారిక X (గతంలో ట్విట్టర్) హ్యాండిల్ పుష్ప స్టార్ అల్లు అర్జున్ కొలతలు తీసుకుంటున్న వీడియోను విడుదల చేయడం ద్వారా అధికారికంగా దీనిని ధృవీకరించింది. మేడమ్ టుస్సాడ్స్ లో తన మైనపు విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గురించి ఇప్పుడు బన్ని ఓపెన్ అయ్యాడు. మేడమ్ టుస్సాడ్స్ దుబాయ్ రిలీజ్ చేసిన తాజా




వీడియోలో 2023 చివరి నాటికి అల్లు అర్జున్ మైనపు విగ్రహం రెడీ కాబోతోందని నిర్వాహకులు తెలిపారు. తెలుగు సినిమా చరిత్రలో తొలిసారి జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డ్ అందుకున్న నటుడు.. డ్యాన్స్ మూవ్ లతో ఐకాన్ స్టార్ అయిన అతడు తన మైనపు విగ్రహంతో ముఖాముఖి కోసం సిద్ధంగా ఉన్నాడు. మునుపెన్నడూ లేని విధంగా ఈవెంట్ కోసం వేచి ఉండండి.. అని మేడమ్ టుస్సాడ్స్ దుబాయ్ ప్రకటించింది. ఈ వీడియోలో బన్ని కూడా తన సందేశం ఇచ్చాడు. "ఒక విధంగా ఇది నాకు ఊహకందని అనుభవం. ఎందుకంటే నేను మేడమ్ టుస్సాడ్స్‌కి వెళ్ళినప్పుడు అక్కడ మైనపు బొమ్మగా కనిపిస్తానని నేను ఎప్పుడూ ఊహించను" అని అల్లు అర్జున్ వాయిస్‌లో చెప్పాడు. అతడి శరీరాకృతికి సంబంధించిన ప్రతి చిన్న డీటెయిలింగ్ తో మైనపు విగ్రహం కోసం కొలతలను తీసుకోవడం ఈ వీడియోలో కనిపించింది. అల్లు అర్జున్ ఎప్పటిలాగే పూర్తిగా నలుపు రంగు సూట్ లో మేడమ్ టుస్సాడ్స్ కి వెళ్లాడు. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. సుకుమార్ దర్శకత్వంలోని 'పుష్ప 2' షూటింగ్‌లో బన్ని బిజీగా ఉన్నారు. మోస్ట్ అవైటెడ్ పుష్ప 2 ఆగస్ట్ 2024లో ప్రేక్షకుల ముందుకు రానుంది. తర్వాత తన కెరీర్ 22వ సినిమాని త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో చేయనున్నాడు. దీనికి తాత్కాలికంగా AA 22 అని పేరు పెట్టారు. అర్జున్ రెడ్డి దర్శకుడు సందీప్ రెడ్డి వంగాతోను ఓ సినిమా చేస్తాడు. ఇది పూర్తి మాస్ యాక్షన్ కథాంశంతో తెరకెక్కనుందని సమాచారం.




# రాజమౌళి హై వోల్టేజ్.. రీ రిలీజ్ ఫిక్స్!




ఇటీవల కాలంలో రీ రిలీజ్ ట్రెండు ఏ స్థాయిలో కొనసాగుతుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. స్టార్ కాంబినేషన్స్ లో బాక్స్ ఆఫీస్ వద్ద మంచి సక్సెస్ అందుకున్న ఒకప్పటి సినిమాలు ఇప్పుడు మళ్లీ కొత్త టెక్నాలజీతో 4కె ముస్తాబుతో వెండి తెరపై మంచి జోష్ తెప్పిస్తున్నాయి. అంతేకాకుండా డిజాస్టర్ అయినా డిఫరెంట్ ప్రయోగత్మక సినిమాలు కూడా ఇప్పటి జనరేషన్ కు కనెక్ట్ అవుతుండడంతో అలాంటి సినిమాలు కూడా విడుదలకు రెడీ అవుతున్నాయి. ఇక లవ్ స్టోరీలు స్టార్ హీరల మాస్ యాక్షన్ ఎలివేషన్స్ సినిమాలు నెలకొకటి అయినా ఈ రీ రిలీజ్ ట్రెండ్ లో మంచి కలెక్షన్స్ అయితే సొంతం చేసుకుంటున్నాయి. ఇక దర్శక ధీరుడు రాజమౌళి ఖాతాలో ఎన్నో బాక్సాఫీస్ ఉన్నాయి. ఇక వాటిలో హై వోల్టేజ్ మూవీ అయినా చత్రపతి కూడా రీ రిలీజ్ రేస్ లో రికార్డులో తిరగరాసేందుకు రెడీ అవుతుంది. ప్రభాస్ మాస్ హీరోఇజాన్ని మరో లెవెల్ కు తీసుకువెళ్లిన ఈ సినిమా అప్పట్లోనే ఊహించని విజయాన్ని అందుకుంది. అయితే ఇప్పుడు ఆ సినిమాను ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా మళ్లీ 4K క్వాలిటీతో విడుదల చేసేందుకు ప్రణాళికలు జరుగుతున్నాయి. అక్టోబర్ 23న ప్రభాస్ పుట్టినరోజు ఫ్యాన్స్ గ్రాండ్ గా సెలబ్రేట్ చేసుకోబోతున్నారు. అందుకే ఈసారి చత్రపతి సినిమాను కూడా రెండు తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేయడానికి సిద్ధమవుతున్నారు. ప్రభాస్ కు సంబంధించిన వర్షం బిల్లా సినిమాలు ఇదివరకే రీ రిలీజ్ అయ్యాయి. అయితే ఆ సినిమాలు పరవాలేదు అనే విధంగా కలెక్షన్స్ అందుకున్నాయి కానీ మరి రికార్డు స్థాయిలో అయితే కలెక్షన్స్ అందుకోలేకపోయాయి.

ఇక ఇప్పుడు రాజమౌళి దర్శకత్వం వహించిన చత్రపతి పై అంచనాలు గట్టిగానే ఉన్నాయి. కాబట్టి ప్రభాస్ పుట్టిన రోజున ఫ్యాన్స్ కు ఒక మంచి ట్రీట్ గా ఉంటుంది అని చెప్పవచ్చు. ఇప్పటికీ ఈ సినిమాలోని యాక్షన్ సన్నివేశాల గురించి మదర్ సెంటిమెంట్ గురించి చాలా చర్చించుకుంటారు. ముఖ్యంగా కీరవాణి మ్యూజిక్ కూడా ఈ సినిమాకు మేజర్ ప్లేస్ పాయింట్. ఇంటర్వెల్ బ్లాగ్ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. మరి రీ రిలీజ్ ట్రెండ్ లో చత్రపతి ఎలాంటి రికార్డులను క్రియేట్ చేస్తుందో చూడాలి.

# బాబోయ్ రజనీ... ఈ ఫోటోలు నిజమేనా? గ్రాఫిక్సా?



సూపర్ స్టార్ రజినీకాంత్ దాదాపు దశాబ్ద కాలం తర్వాత తన స్థాయికి తగ్గ భారీ విజయాన్ని సొంతం చేసుకున్నాడు. నెల్సన్ దిలీప్ దర్శకత్వంలో రూపొందిన జైలర్ సినిమా రూ.500 కోట్లకు పైగా వసూళ్లను దక్కించుకున్నట్లుగా తెలుస్తోంది. సూపర్ స్టార్ పనైపోయిందని విమర్శించిన వారికి జైలర్ కలెక్షన్స్ సమాధానం చెప్పకనే చెప్పాయి అంటూ రజనీ ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. రజినీకాంత్ ఆరోగ్యం సరిగా ఉండదు.. ఆయన సినిమాల్లో నటించడం కోసం ఎక్కువ శాతం డూప్స్ ని వాడుతూ ఉంటాడు అని కూడా కొందరు సోషల్ మీడియాలో విమర్శలు చేసిన వారు ఉన్నారు. కానీ తాజాగా సోషల్ మీడియా లో వైరల్ అవుతున్న రజినీకాంత్ లీక్డ్ ఫోటోలు ఆ విమర్శలకు సమాధానం అన్నట్లుగా నిలుస్తున్నాయి అనడంలో సందేహం లేదు. తలైవర్ 170 వర్కింగ్ టైటిల్ తో టి జి జ్ఞానవేల్ దర్శకత్వంలో రజినీకాంత్ హీరోగా రూపొందుతున్న సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు ఇటీవల జరిగాయి. తాజాగా షూటింగ్ కార్యక్రమాలకు రజినీకాంత్ జాయిన్ అయ్యాడని తెలుస్తోంది. సెట్స్ నుండి రజినీకాంత్ ఫోటోలు బయటకు రావడంతో తమిళ మరియు తెలుగు మీడియాలో వైరల్ అవుతున్నాయి. షర్ట్ లేకుండా వైట్ గడ్డం తో షార్ట్ లో రజినీకాంత్ ఫిజిక్ ని చూసి చాలా మంది అవాక్కవుతున్నారు. కొందరు నిజంగా రజినీకాంత్ కి ఈ స్థాయి ఫిజిక్ ఉందా లేదంటే గ్రాఫిక్స్ తో ఏదైనా మాయ చేస్తున్నారా అంటూ కామెంట్స్ చేస్తున్నారు. గ్రాఫిక్స్ తో సంబంధం లేకుండా నూటికి నూరు శాతం ఇవి రజినీకాంత్ రియల్ ఫోటోలు అంటూ ఫ్యాన్స్ వారికి సమాధానం చెబుతున్నారు. జైలర్ సినిమా హిట్ నేపథ్యం లో తలైవర్ 170 పై అంచనాలు ఆకాశాన్ని తాకేలా ఉన్నాయి. ఈ సినిమా లో మంజు వారియర్, రితికా సింగ్, దుషారా విజయ్ లు హీరోయిన్స్ గా నటిస్తున్నారు. రజినీకాంత్ జైలర్ లో ఎలా అయితే వయసుకు తగ్గ పాత్రలో కనిపించాడో ఈ సినిమాలో కూడా అలాగే కనిపించబోతున్నాడని తెల్లటి గడ్డం చూస్తూ ఉంటే అనిపిస్తుంది. రజినీకాంత్ ను ఆయన వయసుకు తగ్గ పాత్రల్లో చూస్తేనే అభిమానులు, ప్రేక్షకులు నచ్చుతున్నారు. అందుకే ఈ సినిమాలో కూడా రజినీకాంత్ తన ఒరిజినల్ లుక్ లో కనిపిస్తున్నాడు. ఏడు పదుల వయసులో కూడా ఇంత ఫిట్ గా ఉండటం వల్లే షర్ట్ విప్పి మరీ తన ఫిజిక్ ను రజినీకాంత్ చూపిస్తున్నారు. ప్రస్తుత యంగ్ హీరోల్లో ఎంత మంది ఏడు పదుల వయసుకు వచ్చినా ఇంత ఫిట్ గా ఉంటారు అంటే డౌటే అనే సమాధానం వస్తుంది.

# నడుము లోతులో హంసనందిని పారిజాతంలా!

35 బార్డర్ క్రాస్ చేస్తే బండి షెడ్డుకి వెళ్లినట్టే అంటూ యూత్ సెటైరికల్ గా మాట్లాడుకుంటుంది. కానీ 38 వచ్చినా పాతిక ప్రాయం అందాన్ని మెయింటెయిన్ చేస్తూ కించింత్ గ్లామర్ యాంగిల్ ని కోల్పోకుండా ఫిగర్ ని మెయింటెయిన్ చేయడం అన్నది కొందరికే చెల్లింది. వేడెక్కించే హొయలుతో కుర్రకారు కంటికి కునుకుపట్టనివ్వని అందగత్తె హంసా నందిని ఈ విషయంలో అందరికంటే అడ్వాన్స్ డ్ గానే ఉంటుంది. గత నాలుగేళ్లగా వెండి తెరపై మెరవని అందం మళ్లీ యాక్టివ్ అయిన సంగతి తెలిసిందే. ఇన్ స్టాలో హీటెక్కించే భంగిమలతో యువతలో సలపరం పుట్టిస్తుంది. డిజైనర్ దుస్తుల్లో సోషల్ మీడియాని షేక్ చేస్తుంది. మహమ్మారి నుంచి కోలుకున్న తర్వాత మునుపటి అందంతో మురిపించడం అంత వీజీ కాదు.



కానీ హంసానందిని ఆ విషయంలో తగ్గేదే లే అంటూ నెట్టింట దూసుకుపోతుంది. సినిమా ఛాన్సులైతే రావడం లేదు గానీ...బ్యూటీ విషయంలో నా తర్వాతే ఎవరైనా అంటోంది. తాజాగా హంసానందిని నడుము లోతు నీటిలో దిగిన ఫోటో ఒకటి నెట్టింట వైరల్ అవుతుంది. గ్రీన్ కలర్ బ్లౌజ్ లో అమ్మడి ఎద అందాల ఆరబోత పీక్స్ లో ఉంది. పర్ఫెక్ట్ క్లీవేజ్ షోతో ఆకట్టుకుంటుంది. నీటి రంగు కూడా బ్లౌజు రంగుని మ్యాచ్ అవ్వడంతో! మరింత బ్యూటీ అదనంగా యాడ్ అవుతుంది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. వెకేషన్ లో భాగంగా ఈ సండేని ఇలా పర్ఫెక్ట్ గా ప్లాన్ చేసుకుంది. కింద కామెంట్ బాక్స్ లో హంస హొయలపై పోస్టులకు కొదవలేదు. హంసానందిని కెరీర్ సంగతి చూస్తే చివరిగా పంతం సినిమాలో నటించింది. అది రిలీజై నాలుగేళ్లు అవుతుంది. అప్పటి నుంచి సినిమాలకు దూరంగా ఉంటుంది. మరి తాజా యాక్టివిటీ అమ్మడికి కొత్త అవకాశాలు తెచ్చి పెడుతుందా అన్నది చూడాలి. అవకాశాల కోసమైతే సీరియస్ గా ప్రయత్నాలు చేస్తుంది.

## నడుము అందంతో కవ్విస్తున్న నువేక్ష

ఈ మధ్య కాలంలో హీరోయిన్స్ కి ఏమాత్రం తగ్గకుండా సోషల్ మీడియా ముద్దుగుమ్మలు అందాల ఆరబోత చేస్తూ నెటిజన్స్ కి కన్నుల విందు చేస్తున్నారు. ప్రస్తుతం నెట్టింట ఎంతో మంది ముద్దుగుమ్మలు అందాల ఆరబోత చేస్తూ అలరిస్తోంది. తాజాగా నువేక్ష సోషల్ మీడియా సెన్సేషన్ గా మారింది. సినిమాల్లో పెద్దగా అలరించకున్నా కూడా ఎక్కువ శాతం హాట్ ఫోటో షూట్స్ తో ఈ అమ్మడు అలరిస్తూ ఉంది. తాజాగా మరోసారి ఇలా నడుము అందాలను చూపిస్తూ వావ్ అనిపించింది. ఈ రేంజ్ అందాల ఆరబోత చేస్తే ముందు ముందు ఈ అమ్మడు సౌత్ లో స్టార్ హీరోలకు జోడీగా నటించే అవకాశాలు దక్కించుకోవచ్చు అంటున్నారు. సోషల్ మీడియా



ద్వారా పాపులారిటీని సొంతం చేసుకున్న వారు ఈ మధ్య కాలంలో ఎక్కువగా సినిమా ఇండస్ట్రీలో అడుగు పెడుతున్నారు. కనుక నువేక్ష కూడా త్వరలోనే హీరోయిన్ గా బిజీ అవ్వబోతుందని ఈ ఫోటోలను చూస్తుంటే అనిపిస్తుంది అంటూ నెటిజన్స్ తో పాటు మీడియా వర్గాల వారు కూడా మాట్లాడుకుంటున్నారు. వైట్ టాప్ లో గోదుమ రంగు స్కర్ట్ తో నడుము అందాలను సైడ్ యాంగిల్ ద్వారా చూపడం ద్వారా నువేక్ష కన్నుల విందు చేస్తుంది. ఆకట్టుకునే అందం ఈ అమ్మడి సొంతం అంటూ మరోసారి ఈ ఫోటోలతో చెప్పకనే చెప్పింది. ఫ్యాషన్ రంగంలో దూసుకు పోతున్న ఈ అమ్మడు ముందు ముందు వెండి తెరపై తనదైన ముద్ర వేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.



# మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు ఊరట

హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. అసెంబ్లీ ఎన్నికల్లో శ్రీనివాస్ గౌడ్ ఎన్నిక చెల్లదంటూ వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఈ మేరకు పిటిషనర్ వేసిన పిటిషన్ కొట్టివేస్తున్నట్టు న్యాయస్థానం తీర్పును వెల్లడించింది. వివరాల ప్రకారం.. మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఎన్నిక చెల్లదంటూ మహబూబ్‌నగర్‌కు చెందిన రాఘవేంద్రరాజు అనే వ్యక్తి 2019లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానిని కొట్టివేస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. అయితే, 2018లో శ్రీనివాస్ గౌడ్ సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లో తన ఆస్తులు, అప్పుల గురించి తప్పుడు సమాచారం అందించారని రాఘవేంద్రరాజు పిటిషన్ వేశారు. ఎన్నికల అఫిడవిట్‌ను ఒకసారి రిటర్నింగ్ అధికారికి సమర్పించి.. మళ్లీ వెనక్కి తీసుకుని సవరించి అందజేశారని అందులో పేర్కొన్నారు. ఇది చట్టవిరుద్ధమని, ఆయన ఎన్నికను రద్దు చేయాలని కోరారు. దీనిపై ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు.. తీర్పులను నేటికి వాయిదా వేసింది. దీంతో నేడు తీర్పును వెలువరించింది.

ఇక, తెలంగాణ హైకోర్టు తీర్పుతో మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కు పెద్ద ఊరట లభించింది. మంత్రికి అనుకూలంగా తీర్పు రావడంతో ఆయన మద్దతుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మరోవైపు.. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నిన్న(సోమవారం) ఎలక్షన్ షెడ్యూల్ విడుదలైన విషయం తెలిసిందే. నవంబర్ 30వ తేదీన ఎన్నికలకు కౌంటిగ్ జరగనుంది. డిసెంబర్ 3వ తేదీన ఎన్నికల ఫలితాలు విడుదల కానున్నాయి.





# మోదీకి నెతన్యాహు ఫోన్.. ఇజ్రాయెల్‌కు అండగా ఉంటామని భారత్ హామీ

దిల్లీ: హమాస్ మిలిటెంట్లపై ఇజ్రాయెల్ సైన్యం భీకర పోరు కొనసాగిస్తున్న వేళ ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు.. భారత ప్రధాని నరేంద్రమోదీకి ఫోన్ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్‌కు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చిన ప్రధాని మోదీ.. ఉగ్రదాడుల్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. "ఇజ్రాయెల్ -హమాస్ మధ్య ఘర్షణలు, అక్కడి తాజా పరిస్థితుల గురించి నెతన్యాహు ఫోన్ చేసి తెలియజేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో ఇజ్రాయెల్‌కు యావత్ భారతావని అండగా నిలుస్తుంది. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా సరే.. దాన్ని భారత్ నిస్సందేహంగా, తీవ్రంగా ఖండిస్తుంది" అని మోదీ ఎక్స్ (ట్విటర్) వేదికగా వెల్లడించారు. తమ దేశంలోకి చొరబడి మారణహోమం సృష్టించిన హమాస్ మిలిటెంట్లను తుడిచిపెట్టేందుకు ఇజ్రాయెల్ సైన్యం భీకర పోరు కొనసాగిస్తోంది. గాజా స్ట్రిప్‌లోని హమాస్ స్థావరాలపై వైమానిక దాడులు చేస్తోంది. మరోవైపు తమ భూభాగంలోకి చొరబడిన దాదాపు 1500 మంది హమాస్ ఉగ్రవాదులను హతమార్చినట్లు ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. హమాస్‌తో యుద్ధం నేపథ్యంలో దేశ ప్రజలనుద్దేశించి నెతన్యాహు మాట్లాడారు. తమ దేశంపై దాడి చేసి హమాస్ ఘోర తప్పిదం చేసిందని, అందుకు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈ యుద్ధాన్ని తాము మొదలుపెట్టలేదని, కానీ ముగించేది మాత్రం తామేనని అన్నారు. తమ ప్రతిదాడి హమాస్‌తో పాటు, ఇజ్రాయెల్ శత్రు దేశాలకు దశాబ్దాలపాటు గుర్తుండిపోతుందని నెతన్యాహు హెచ్చరించారు.

# మజ్లిస్ కనుసన్నల్లో కేసీఆర్ పాలన



ఆదిలాబాద్: మజ్లిస్ కనుసన్నల్లో కేసీఆర్ పాలన నడుస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపించారు. మంగళవారం నాడు ఆదిలాబాద్‌లో అమిత్ షా పర్యటించారు. జిల్లాలో జనగర్జన భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సభలో అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.."డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేసీఆర్ ఎంతమంది లబ్ధిదారులకు ఇచ్చారు. కొడుకు, కూతురు కోసమే కేసీఆర్ పని చేస్తున్నారు. ఆర్టికల్ 360తో కశ్మీర్‌ను కాపాడుకున్నాం. రాం మందిర్ నిర్మాణం చేస్తోంది, భవ్య రాం మందిర్ జనవరి నుంచి భక్తులకు అందుబాటులోకి వస్తుంది. సర్జికల్ స్ట్రైక్ చేసి పాకిస్తాన్ ఉగ్రవాదులను మట్టుపెట్టాం. తెలంగాణలో రజాకార్ల పాలన పోవాలంటే బీజేపీ అధికారంలోకి రావాలి. రైతుల ఆత్మహత్యల్లో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం అవినీతి పాలన చేస్తోంది" అని అమిత్ షా పేర్కొన్నారు.



# మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజాప్రతినిధులు

హైదరాబాద్ : ప్రగతి భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌ను ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

మంత్రి జగదీశ్ రెడ్డి ఆధ్వర్యంలో శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, శానంపూడి సైదిరెడ్డి, గొంగిడి సునీత, గాదరి కిశోర్‌తో పాటు పలువురు నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికలకు సంబంధించిన అంశాలతో పాటు పలు విషయాలపై చర్చించారు.

ఈ నెల 16న భువనగిరిలో నిర్వహించే బీఆర్ఎస్ బహిరంగ సభపై సమీక్షించారు.

ఈ సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొననున్నారు. సీఎం జిల్లాల పర్యటనకు సంబంధించి నిన్న ప్రకటన వెలువడిన సంగతి తెలిసిందే.

# బీఆర్ఎస్ ప్రభుత్వం అంటే బీసీల ప్రభుత్వం : ఎమ్మెల్సీ కవిత



నిజామాబాద్ : కుల వృత్తులు పూర్వ వైభవం వం తీసుకువస్తున్న నాయకుడు సీఎం కేసీఆర్. ఎన్నికల నగారా నిన్ననే మోగింది. మొట్టమొదటి సమావేశం గౌడ కుల బాంధవులతో జరురుకోవటం సంతోంగా ఉందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కంటేశ్వర్‌లో గౌడ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వాలు గౌడ కులస్తులను కల్లు వ్యాపారాన్ని చిన్న చూపు చూశారు.కానీ కేసీఆర్ ఆనాడే ఉద్యమ సమయంలో చెప్పారు. తెలంగాణ ఏర్పాటు అయితే గౌడ కులస్తులకు అండగా ఉంటాం అన్నారు. అలాంటి కులవృత్తులను పునరుద్ధరించేందుకు సీఎం కేసీఆర్ విశేషంగా కృషి చేస్తున్నారని చెప్పారు. గీత కార్మికులకు ఏమైనా సమస్యలు ఉంటే సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వం పాలసీగా తీసుకొని ఈత వనాలని పెంచుతున్నది. మద్యం టెండర్లలో 15 శాతం గౌడ కులస్తులకు రిజర్వేషన్ ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నం. గత ప్రభుత్వాల కాలంలో నిజామాబాద్ నుంచి ఎంతో మంది పెద్ద నాయకులు పనిచేశారు. జిల్లాకు ఒకటే బీసీ హాస్టల్ ఉండేది. అలాంటిది ఈరోజు 15 బీసీ హాస్టల్స్‌ను ఏర్పాటు చేసుకున్నాం. రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల మంది బీసీ బిడ్డలకు ఫీజు రియింబర్స్ మెంట్ ఇస్తున్నాం. తెలంగాణలోఉన్నది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదు, బీసీల ప్రభుత్వం అన్నారు. ఎన్నికలప్పుడు అనేక పార్టీలు వస్తాయి. వారిని నిలదీయండి. బీఆర్ఎస్ పార్టీగా పని చేశాం కాబట్టి హక్కుగా ప్రజల వద్దకు వస్తున్నాం. అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. డిసెంబర్ 3 తర్వాత మళ్లీ ఏర్పడేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో బంగారం బిస్కెట్స్ పట్టివేత




హైదరాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో బంగారం బిస్కెట్లు, నగలు లభ్యమయ్యాయి. శంషాబాద్ విమానాశ్రయంలో అక్రమంగా బంగారాన్ని తరలిస్తున్న ఓ ప్రయానికుడిని హైదరాబాద్ సీఐఎస్ఎఫ్ ప్రత్యేక బృందం పట్టుకుంది.

అంతార్జాతీయ అరైవల్ ప్యాసింజర్ రియాద్ నుంచి 2 బంగారు బిస్కెట్లు, 311 గ్రాముల బంగారు చైన్‌ను అధికారులు సీజ్ చేశారు. మస్కట్ మీదుగా ఒమన్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్ నెం. డబ్ల్యూవై-0231 నుంచి రియాద్ శంషాబాద్ విమానాశ్రయం చేరుకున్నాడు. అయితే అనుమానాస్పదంగా వెళ్తున్న రియాద్‌ను పట్టుకున్న అధికారులు.. విచారణ చేసి తనిఖీ చేయగా బంగారం బెస్కట్లు, నగదు పట్టుబడింది. వెంటనే బంగారాన్ని స్వాధీనం చేసుకున్న సీఐఎస్ఎఫ్ అధికారులు.. ప్రయాణికుడిని కస్టమ్స్ అధికారులకు అప్పగించారు.

# హుస్నాబాద్ బీఆర్ఎస్ కార్యకర్తలతో మంత్రి హరీశ్‌రావు సమావేశం

సిద్దిపేట : హుస్నాబాద్‌లో మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, ఎమ్మెల్యే సతీష్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. హుస్నాబాద్ కార్యకర్తలపై నమ్మకంతో కేసీఆర్ తొలి ఎన్నికల సభ ఇక్కడ నిర్వహిస్తున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ గౌరవెల్లి ప్రాజెక్టును హుస్నాబాద్‌కు ఇచ్చిన గొప్పవరం అని పేర్కొన్నారు. తెలంగాణ పథకాలను దేశం మొత్తం అమలు చేస్తున్నారని స్పష్టం చేశారు. వరి ధాన్యం, డాక్టర్ల ఉత్పత్తిలో దేశంలో రాష్ట్రం నంబర్ వన్ అయిందని మంత్రి హరీశ్‌రావు సపేర్కొన్నారు. ఈ నెల 15వ తేదీన తెలంగాణ భవన్ వేదికగా బీఆర్ఎస్ మేనిఫెస్టోను ముఖ్యమంత్రి కేసీఆర్ విడుదల చేయనున్నారు. అదేరోజు సాయంత్రం హుస్నాబాద్‌లో



నిర్వహించే బీఆర్ఎస్ బహిరంగ సభలో కేసీఆర్ పాల్గొని ఎన్నికల శంఖారావాన్ని పూరించనున్నారు. ఈ నేపథ్యంలో ఇవాళ హరీశ్‌రావు హుస్నాబాద్‌లో పర్యటించి, సభా ఏర్పాట్లను పరిశీలించారు.

# ఈ నెల 13 నుంచి 24 వరకు 5,265 ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

## అదనపు చార్జీలు లేవు : టీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్




హైదరాబాద్ : బతుకమ్మ, దసరా పండుగలకు ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు టీఎస్ఆర్టీసీ సన్నద్ధమైంది. ఈ నెల 13 నుంచి 24 వరకు 5,265 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసిన సంస్థ.. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నది. హైదరాబాద్ బస్‌భవన్‌లో ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ అధ్యక్షతన పోలీస్, రవాణాశాఖ అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ.. ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేయడంలో ఆర్టీసీ ఉద్యోగులతో కలిసి పోలీస్, రవాణాశాఖలు సహకరిస్తున్నాయని చెప్పారు. ఈ నెల 20 నుంచి 23 వరకు అధిక రద్దీ అవకాశం ఉండటంతో ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపారు. అదనంగా 536 సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించినట్టు వివరించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాలతోపాటు ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్టు వెల్లడించారు. గత దసరా కన్నా ఈసారి వెయ్యి బస్సులను అదనంగా తిప్పుతున్నట్టు తెలిపారు. ఈసారి ప్రత్యేక బస్సుల్లో ఎలాంటి అదనపు చార్జీలు వసూలు చేయట్లేదని సజ్జనార్ స్పష్టంచేశారు. హైదరాబాద్ సిటీ అదనపు కమిషనర్(ట్రాఫిక్) జీ సుధీర్‌బాబు మాట్లాడుతూ.. ప్రయాణికులకు మెరుగైన, నాణ్యమైన సేవలందిస్తోన్న టీఎస్ఆర్టీసీకి తమ సహకారం ఎప్పటికీ ఉంటుందని అన్నారు. బతుకమ్మ, దసరా ప్రత్యేక సర్వీసుల్లో ముందస్తు రిజర్వేషన్‌ను సంస్థ అధికారిక వెబ్‌సైట్ tsrtconline.inలో చేసుకోవాలని సజ్జనార్ కోరారు. పూర్తి సమాచారం కోసం టీఎస్ఆర్టీసీ కాల్‌సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033ను సంప్రదించాలని సూచించారు.

# అజారుద్దీన్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురు





న్యూఢిల్లీ: హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు అజారుద్దీన్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. హెచ్‌సీఏ ఓటర్ జాబితా నుంచి తన పేరు తొలగించడంపై అజారుద్దీన్ సుప్రీంకోర్ట్‌లో పిటిషన్ దాఖలు చేశారు.

తనని హెచ్‌సీఏ ఎన్నికల్లో పాల్గొనేలా ఆదేశాలు ఇవ్వాలని అజార్ కోరారు. అయితే ఇప్పటికే ఓటర్ జాబితా వచ్చేసిందని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ తరుణంలో జోక్యం చేసుకోలేమని ఉన్నతన్యాయస్థానం స్పష్టం చేసింది.

సుప్రీం కోర్టు నియమించిన ఏకసభ్య కమిటి ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేస్తోందని తెలిపింది. అజారుద్దీన్ వాదనతో ఏకీభవించని సుప్రీం కోర్టు.. తదుపరి విచారణ అక్టోబర్ 31 కు వాయిదా వేసింది.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కేసీఆర్ సతీమణి కల్వకుంట్ల శోభ

తిరుమల: తిరుమల శ్రీవారిని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ సతీమణి శోభ దర్శించుకున్నారు. ఆమె.. మంగళవారం వేకువజామున అర్చన సేవలో స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం, ఆలయ అర్చకులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

టీటీడీ అధికారులు స్వామివారి చిత్ర పటాన్ని బహుకరించారు. అయితే, నిన్న తిరుమలకి చేరుకున్న కల్వకుంట్ల శోభ, రాత్రి తిరుమలలో బస చేశారు. మరోవైపు.. తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. తిరుమల శ్రీవారి దర్శనానికి ఐదు కాంపార్ట్‌మెంట్‌లలో భక్తులు వేచి ఉన్నారు. శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటల సమయం పడుతుండగా, ప్రత్యేక దర్శనానికి 3 గంటల



సమయం పడుతోంది. నిన్న శ్రీవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య 68,828. నిన్న శ్రీవారి హుండీ ఆదాయం 3.53 కోట్లు. సోమవారం తలనీలాలు సమర్పించిన భక్తుల సంఖ్య 28,768గా ఉంది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com